సంపుటి : 18
సంచిక : 101
Vol : 18
Issue : 101

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

కరీంనగర్, శనివారం 13 జూన్ 2026
Karimnagar, Saturday 13 June 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00





WANTED
పీపుల్స్ డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859


## గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు

**నావికుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం హై అలర్ట్..**

**పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ :** పశ్చిమాసియా (గల్ఫ్) ప్రాంతంలో మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులు, సముద్ర భద్రతా సవాళ్ల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆయా ప్రాంతాల గుండా ప్రయాణించే వాణిజ్య నౌకల్లో పనిచేస్తున్న భారతీయ నావికుల ప్రాణాలను, భారతదేశ సముద్ర ప్రయోజనాలను పరిరక్షించడానికి భారత ప్రభుత్వం హై-అలర్ట్ ప్రకటించింది. ప్రతిస్పందన యంత్రాంగాలను పర్యవేక్షించడంతోపాటు.. సమన్వయం చేయడం కోసం అనునిత్యం పనిచేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల మంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ద్వారా.. హోర్ముజ్ జలసంధి, ఒమన్ గల్ఫ్, వాటికి ఆనుకుని ఉన్న సముద్ర ప్రాంతాలలో, వాటి పరిసరాల్లోని (మిగతా 2లో...)

## విషాదం...

- భార్యతో గొడవపడి పిల్లలతో నిజాంసాగర్‌లో దూకిన తండ్రి
- భార్యతో గొడవపడి దారుణం..
- ముగ్గురి మృతదేహాలు వెలికితీత



వివరాలు : 2వ పేజీలో...



## ప్రభుత్వ బడి... పేదల గుడి..

- ఈ ఏడాది నుంచి స్కూళ్లలో కీలక మార్పులు
- అడ్మిషన్లు గణనీయంగా పెంచడమే లక్ష్యం
- పేద విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం
- కొత్త పథకాలతో ప్రారంభంకానున్న స్కూళ్లు...

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : పేద విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను గణనీయంగా పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది. జూన్ 15న రాష్ట్రంలోని పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికే విద్యాశాఖ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో గత ఏడాదితో పోలిస్తే కనీసం 10 శాతం మేర అడ్మిషన్లు పెంచాలని ఉపాధ్యాయులకు లక్ష్యాలను నిర్దేశించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ప్రత్యేక వర్క్‌బుక్స్ అందించనున్నారు. అలాగే రాష్ట్రంలోని 9 వేల ప్రభుత్వ పాఠశాలలకు ఆగస్టు నాటికి హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు.. ప్రతిరోజూ అల్పాహారం, వారానికి మూడు రోజుల పాటు నాణ్యమైన పాలను కూడా అందించనున్నారు. పాఠశాలలు ప్రారంభమైన రోజునే యూనిఫాంలు, బూట్లు, బెల్టులు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, వాటి పంపిణీలో స్వల్ప ఆలస్యం జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ సోషల్ (మిగతా 2లో...)

## సింగరేణికి ఊపిరి!



- రామగుండం బొగ్గు గని ప్రాజెక్టుకు అనుమతులు
- రూ.2వేల కోట్లకు పైగా పెట్టుబడి
- 5 కొత్త బగ్గుగనులు తవ్వే యోచన
- ఏడాదికి 2.10 కోట్ల టన్నుల బొగ్గు వెలితీతే లక్ష్యం

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం.. సింగరేణి సంస్థకు గుడ్‌న్యూస్ చెప్పింది. రామగుండం బొగ్గు గని (ఆర్‌జీ కోల్‌మైన్) పేరుతో సింగరేణి సంస్థ తయారు చేసిన కొత్త ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రామగుండం బొగ్గు గని ప్రాజెక్టుకు అన్ని పర్యావరణ అనుమతులు మంజూరు చేసినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఈ రామగుండం బొగ్గు గని ప్రాజెక్టు కోసం 4326.08 హెక్టార్ల భూమి అవసరం కావడంతో.. అది సేకరించేందుకు పర్యావరణ అనుమతులు కావాల్సి ఉండగా.. తాజాగా ఆ అనుమతులను కేంద్రం ఇవ్వడంతో బొగ్గును తవ్వుకునేందుకు మార్గం సుగమం అయింది. సింగరేణి సంస్థ పరిధిలో బొగ్గు తవ్వకాలు (మిగతా 2లో...)

## 'పీపుల్స్‌డైరీ'కి ప్రజా సంఘాల మద్దతు



- శంకర్‌నాయక్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు
- అక్రమాల్ని ఎండగడితే అక్రమ కేసులా?
- 'పీపుల్స్ డైరీ'పై కక్షసాధింపు ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు!
- భూకబ్జాలను ప్రశ్నించినందుకు పరువు నష్టం దావానా?
- గర్జిస్తున్న వివిధ ప్రజాసంఘాలు....

భీమదేవరపల్లి, జూన్ 12 (పీపుల్స్ డైరీ) : అక్రమార్కులపై అక్షర యుద్ధం చేస్తూ పేదల పక్షాన నిలుస్తున్న 'పీపుల్స్‌డైరీ' దినపత్రికపై కక్ష సాధింపు చర్యలకు పూనుకున్న ఆర్టీఐ మాజీ కమిషనర్ శంకర్‌నాయక్‌పై వివిధ సంఘాలు మండిపడుతున్నాయి. ఈవిషయంలో పత్రికకు ఆయా సంఘాలు మద్దతుగా నిలుస్తూ బాధితు లకు, పత్రిక పక్షాన పోరాడుతామని హెచ్చరి స్తున్నాయి. బాధిత ప్రజల పక్షాన నిలబడి, సమాజంలో జరుగుతున్న భూకబ్జాలు, అవినీతి అక్రమాలను నిరంతరం ప్రశ్నిస్తున్న 'పీపుల్స్ డైరీ' దినపత్రిక, దాని సిబ్బందిపై కొందరు స్వార్థపరులు, అవినీతి అధికారులు అక్రమ కేసులు బనాయించడాన్ని, బెదిరింపులకు దిగ డాన్ని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు చెప్యాల ప్రకాష్, కండె సుధాకర్ తీవ్రస్థాయిలో (మిగతా 2లో...)



## నోరు తెరవా?




ఎన్నో ప్రశ్నలు...
సమాధానాలు కరువు...

జవాబుదారీ తనంలేని పాలకవర్గం, అధికారులు

నీళ్ల ట్యాంకులో కోతుల కళేబర వ్యవహారంపై ఎందుకు స్పందించరు?

డీఎల్‌పీఓ ఆశ్చర్యకరమైన సమాధానం

ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయని డీపీఓ

ఉపసర్పంచ్ నిర్లక్ష్యపు స్టేట్‌మెంట్లు...

విషయం బయటికి ఎందుకు తెలియనీయడం లేదో...

తెలుకుట్టిన దొంగల్లా వీరి వ్యవహారం...

పట్టించుకోని స్థానిక ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు

ఉన్నతాధికారులు పూర్తి విచారణ జరపాలి...



2వ పేజీలో..

# నోరు తెరవరా?

**పీపుల్స్‌డైరీ–శాయంపేట :**

శాయంపేట మండల కేంద్రంలో ఇటీవల నీళ్ల ట్యాంకులో కోతులు పడి చనిపోయి కళేబరాలుగా మారినా అవే నీటిని ప్రజలకు సరఫరా చేశారనే ఆరోపణల అంశంలో పాలక వర్గం నోరు తెరవడం లేదు. ఈ సంచలన ఘటనపై 'పీపుల్స్‌డైరీ' దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నిర్లక్ష్యంలో ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నప్పటికీ సమాధానాలు మాత్రం కరువవుతున్నాయి. కనీసం పాలకవర్గం గానీ, అధికారులు గానీ ఈవిషయంలో జవాబుదారీ తనంగా వ్యవహరించకపోవడం ఆరోపణలకు మరింత బలం చేకూరినట్టవుతోంది. తప్పును ఒప్పుకుంటే రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారి అభాసుపాలవడంతో పాటు ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని భయపడుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జరిగిన ఇంతపెద్ద పొరపాటును ఎంతకాలం సమాధి చేయగలరు...? బయటి ప్రపంచానికి తెలియకుండా ఎన్నిరోజులు దాచగలరు... అనే చర్చ సర్వత్రా జరుగుతోంది.

**ఆశ్చర్యకరంగా డీఎల్‌పీఓ వ్యవహారం...**

**ఫోన్‌లో ఏం మాట్లాడారో తెలుసా...?**

ఇటీవల డీఎల్‌పీఓ తన పరిధిలోని కొన్ని గ్రామాలకు తనిఖీలకు వెళ్లినట్టు కొన్ని ఆధారాల ద్వారా తెలుస్తోంది. ఆయా కార్యక్రమాల్లో వాటర్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించే క్రమంలో శాయంపేట వాటర్ ట్యాంకులో కోతుల కళేబరాలు బయల్పడిన విషయాన్ని ప్రస్తావించినట్టు స్పష్టమవుతోంది. శాయంపేట ఘటనను ఉదహరిస్తూ ఇలాంటి తప్పులు జరగకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని, ట్యాంకులను నిత్యం తనిఖీచేయాలని సూచించినట్టు తెలిసింది.

అయితే 'పీపుల్స్‌డైరీ' ప్రతినిధి ఫోన్‌లో శాయంపేట ఘటనపై వివరణ కోసం డీఎల్‌పీఓను సంప్రదించగా ఈ అంశంపై తానేమీ మాట్లాడలేని, డీపీఓకు ఫోన్ చేయాలని సూచించడం ఆశ్చర్యకరంగా, అనుమానాస్పదంగా ఉంది. అయితే సదరు డీఎల్‌పీఓనే పత్రికా ముఖంగా శాయంపేట ఘటనను ప్రస్తావించి ప్రస్తుతం ఆ విషయంపై ప్రశ్నిస్తే ఎందుకు దాటవేస్తున్నారో అర్థం కావడం లేదు.

**ఫోన్ ఎత్తని డీపీఓ...**

ఇక డీఎల్‌పీఓ అనుమానాస్పద సమాధానంతో చివరకు డీపీఓకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా సదరు అధికారి మాత్రం ఎత్తడం లేదు. బాధ్యతాయుత పదవుల్లో ఉండి కనీసం జవాబుదారీ తనం లేకపోవడం అధికారుల చిత్తశుద్ధికి నిదర్శనంగా గోచరిస్తోంది.

**తప్పు జరగనప్పుడు ఎందుకు భయం!**

శాయంపేట గ్రామంలో జరిగిన ఈ సంచలన ఘటనపై అధికారులు గానీ, పాలకవర్గం గానీ బాధ్యతయుతంగా, జవాబుదారీ తనంగా వ్యవహరిస్తే ఎలాంటి అనుమానాలకు తావివ్వకుండా ఉండేది. కానీ ఈ విషయంలో అందరూ గోప్యంగా ఉండడం, ధైర్యంగా మాట్లాడకపోవడం వల్ల జరిగిన ఘటన నిజమేనని వారు ఒప్పుకోకనే ఒప్పుకున్నట్టు అవుతోంది.

**ఉపసర్పంచ్ నిర్లక్ష్యపు స్టేట్‌మెంట్**

ఇక ఈ ఘటనలో ఉపసర్పంచ్ ఉలిక్కిపాటు అర్థమవుతోంది. అసలు ఎలాంటి తప్పే జరగలేదని స్టేట్‌మెంట్‌లు ఇస్తూ ఏకపక్షంగా తీర్మానిస్తున్నట్టు స్పష్టమవుతోంది. కొన్ని పత్రికలకు మాత్రమే స్టేట్‌మెంట్లు ఇచ్చి సమస్యను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నట్టు అవగతమవుతోంది. పీపుల్స్‌డైరీ బృందం గ్రామాన్ని సందర్శించగా కొందరు గ్రామస్తులు జరిగిన తప్పు వాస్తవమేనని వివరించగా ఉపసర్పంచ్ మాత్రం అందుకు విరుద్దంగా ప్రకటించడం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. తప్పుడు వార్తలు రాస్తున్నారని నిందలు వేస్తున్నాడే గానీ ఘటనపై పారదర్శక వివరణ మాత్రం ఇవ్వకుండా అనుమానాస్పదంగా వ్యవహరించడాన్ని గ్రామస్తులు గుర్తిస్తున్నారు. ఎలాంటి తప్పు జరగలేదని ఏకపక్షంగా ఎలా తీర్మానించారో అర్థం కావడం లేదు. అంతేకాక ఆధారాలంటే వార్తలు రాసుకోండంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు.


ప్రజలకు సురక్షిత నీరు అందించాలి

నడికూడ : గ్రామాల్లోని వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేసి ప్రజలకు సురక్షిత నీరు అందించాలని డీఎల్‌పీఓ రవిబాబు సూచించారు. శనివారం మండలంలోని కంఠాత్మకూరు, రామకృష్ణాపూర్ గ్రామాల్లో మంచినీటి వాటర్ ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల శాయంపేట మండలంలో పలు వాటర్ ట్యాంక్‌లో కోతులు పడి చనిపోయాయని గుర్తుచేశారు. జీపీ సిబ్బంది తురుచూ వాటర్ ట్యాంకులను పరిశీలించి శుభ్రపరుచాలని అన్నారు. నీటి సరఫరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శిలు ఆవుల కుమార్ స్వామి, మహ్మద్ ముస్తఫా, కారోబార్ రమేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రవిబాబు

డీఎల్‌పీఓ పర్యటనలో శాయంపేట ఘటనను ప్రస్తావిస్తూ ఒక పత్రికలో వచ్చిన వార్త

**ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు ఏం చేస్తున్నాయి?**

ఇదిలా ఉంటే, ప్రజల సంక్షేమం పట్ల నిత్యం పరితపించాల్సిన సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గం మరీ ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం ఈ విషయంలో ప్రజలకు ఏం జరిగిందో తెలుసుకునేందుకు స్థానిక ప్రజాసంఘాలు గానీ, రాజకీయ పార్టీలు గానీ మొగ్గుచూపకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. తాగే నీరు దుర్వాసన వస్తోందని జనం నెత్తినోరు మొత్తుకున్నా కనీసం ట్యాంకులో ఏం జరిగిందోనని తెలుసుకోకపోవడం పాలకవర్గం పనీతిరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రజల మాటకు, వారి ప్రాణాలకు కనీసం విలువ ఇవ్వకుండా ఇంత నిర్లక్ష్యం ఎలా వహించారోననే చర్చ జరుగుతోంది.

- ఎన్నో ప్రశ్నలు... సమాధానాలు కరువు...
- జవాబుదారీ తనంలేని పాలకవర్గం, అధికారులు
- నీళ్ల ట్యాంకులో కోతుల కళేబర వ్యవహారంపై ఎందుకు స్పందించరు?
- డీఎల్‌పీఓ ఆశ్చకరమైన సమాధానం
- ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయని డీపీఓ
- ఉపసర్పంచ్ నిర్లక్ష్యపు స్టేట్‌మెంట్లు...
- విషయం బయటికి ఎందుకు తెలియనీయడం లేదో...
- తేలుకుట్టిన దొంగల్లా వీరి వ్యవహారం...
- పట్టించుకోని స్థానిక ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు
- ఉన్నతాధికారులు పూర్తి విచారణ జరపాలి...

# 'పీపుల్స్‌డైరీ'కి ప్రజాసంఘాల మద్దతు





(మొదటి పేజీ తరువాయి)

ఖండించారు. ఈ సందర్భంగా శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను హరించేలా సాగిస్తున్న ఇటువంటి కక్షసాధింపు చర్యలు ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు వంటివని వారు స్పష్టం చేశారు.

**నిజాలు రాస్తే పరువునష్టం దావా వేస్తారా?**

ఖమ్మం జిల్లా కారేపల్లి (సింగరేణి) మండలం ఉసిరికాయలపల్లి గ్రామ పరిధిలో పేద రైతు పచ్చిపాల భద్రయ్యకు చెందిన భూమిని అక్రమంగా కబ్జా చేయడానికి ప్రయత్నించిన మాజీ ఆర్టిఐ కమిషనర్ గగులోత్ శంకర్ నాయక్ అక్రమాలను ఎండగట్టినందుకు గానూ.. 'పీపుల్స్ డైరీ' న్యూస్ సంస్థపై, జర్నలిస్టులపై రూ. 5 కోట్ల పరువు నష్టం దావా నోటీసులు పంపడాన్ని అంబేద్కర్ సంఘం నేతలు తీవ్రంగా తప్పుపట్టారు. బాధితుడు పచ్చిపాల భద్రయ్య తాను సాగు చేసుకుంటున్న భూమిని కాపాడుకోవడానికి, అక్రమార్కుల వేధింపులు తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం అత్యంత బాధాకరం అన్నారు.

**రికార్డుల్లో ఉన్నదే పత్రిక రాసింది!**

సింగరేణి తాహసిల్దార్ రికార్డుల ప్రకారం కూడా సదరు భూమి భద్రయ్యదేనని రుజువైందని, బాధితుడి ఫిర్యాదు మేరకు ఇప్పటికే కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో శంకర్ నాయక్‌పై ఎఫ్ఐఆర్ నమోదైందని నేతలు గుర్తు చేశారు. నిజాలు ఇలా ఉంటే, పత్రిక నోరు నొక్కేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు.

**అంబేద్కర్ సంఘం డిమాండ్లు**

- ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఉసిరికాయలపల్లి వివాదా స్పద భూములపై రీ–సర్వే నిర్వహించి, అసలైన పేద భూ యజమానులకు పూర్తి న్యాయం చేయాలి.
- తప్పుడు రికార్డులు సృష్టించిన అక్రమార్కులపై,వారికి సహకరించిన అవినీతి అధికారులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాల న్నారు.
- ప్రజల పక్షాన నిలిచిన 'పీపుల్స్ డైరీ' దిన పత్రిక సంస్థ, విలేకరులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే బేషరతుగా ఉపసంహరించుకోవాలి.

**'పీపుల్స్ డైరీ'కి మా సంపూర్ణ మద్దతు!**

?నిత్యం సత్యం వైపు నిలబడే 'పీపుల్స్ డైరీ' దినపత్రిక సంస్థకి, జర్నలిస్టులకు తెలంగాణ అంబేద్కర్ సంఘం ఎల్లప్పుడూ సంపూర్ణ మద్దతు తెలుపుతూ,కొండంత అండగా ఉంటుందని చెప్యాల ప్రకాష్, కండె సుధాకర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎంతటి శక్తులు ఎదురొచ్చినా ప్రజా పక్షాన పోరాడే కలాలను ఆపలేరని వారు హెచ్చరించారు.


ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రామచంద్రం మాదిగ శనిగరపు రవీందర్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు


ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి మాట్ల వెంకటస్వామి మాదిగ

## కేసులు వెనక్కి తీసుకోవాలి

### ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా



పీపుల్స్‌డైరీ–హనుమకొండ : ప్రజా సమస్యల గురించి నిర్భయంగా వార్త రాసిన పీపుల్స్ డైరీ పత్రిక పై పరువు నష్టం దావా వేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పసుల వినయ్ కుమార్ డిమాండ్ చేశారు. పీపుల్ డైరీ దినపత్రికపై వేసిన పరువు నష్టం దావాను అదేవిధంగా విలేకరులపై పెట్టిన అక్రమ కేసులు వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శంకర్‌నాయక్ ఆగడాలపై ఉన్నతస్థాయి అధికారులు, ప్రభుత్వ పెద్దలు విచారణ జరపాలన్నారు. ప్రస్తుత సమాజంలో రోజురోజుకు ప్రశ్నించే వారిపై, నిర్భయంగా వార్తలు రాస్తున్న పత్రికలపై అక్రమంగా కేసులు పెడుతూ నానా రకాలుగా ఇబ్బందులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి అక్రమార్కులకే యంత్రాంగం వత్తాసు పలకడం తగదన్నారు. ఇలాంటి విధానాలను ప్రోగ్రెసి స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండిస్తున్నామని వినయ్ కుమార్ అన్నారు.

## కక్షసాధింపు చర్యలను ఖండిస్తున్నాం:

### డి తిరుపతి, రిసర్చ్ స్కాలర్ కేయూ విద్యార్థి జెఏసి చైర్మన్



అవినీతిపై వార్తలు రాస్తున్న పీపుల్స్ డైరీ పై కక్ష సాధింపు చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, నిజాలను నిర్భయంగా రాస్తున్న పత్రికపై అసత్యపు ఆరోపణలు చేయడం సరికాదని, ఉన్న వాస్తవాలను రాస్తే దాన్ని ఓర్చుకోలేనివారు కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గమని, బెదిరింపులతో పత్రికలను భయపెట్టాలని చూడడం అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపడమేనని నిజాలను రాసే పీపుల్స్ డైరీ పై ఆరోపణలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు.

## పత్రికపై కక్షసాధింపు సిగ్గుమాలిన చర్య : ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఇసుకల వెంకన్న

ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూన్ 12 (పీపుల్స్ డైరీ) : ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజల గొంతుకగా పనిచేస్తున్న పీపుల్స్‌డైరీ పత్రికపై ఆర్టిఐ మాజీ కమిషనర్ శంకర్ నాయక్ పరువు నష్టం దావా వేయడం సిగ్గుమాలిన చర్య అని ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఇసుకల వెంకన్న తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం మీడియా బాధ్యత అని అన్నారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను ప్రచురించినందుకు మీడియా సంస్థలను బెదిరించేలా పరువు నష్టం కేసులు పెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.

ప్రజల తరఫున ప్రశ్నించే మీడియా సంస్థలపై ఒత్తిడి తీసుకురావడానికి చేసే ప్రయత్నాలను ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాలు ఖండించాలని వెంకన్న పిలుపునిచ్చారు. మీడియా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, పీపుల్స్ డైరీకి తమ పూర్తి సంఘీభావం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.



# ప్రభుత్వ బడి... పేదల గుడి...

(మొదటి పేజీ తరువాయి)

రెస్పాన్సిబిలిటీ నిధులతో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించనున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ ఇప్పటికే పాఠశాలలకు చేరవేసినట్లు అధికారులు తెలిపారు.

గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య సుమారు 20 వేల మేర తగ్గింది. 2024–25లో 16.78 లక్షల మంది విద్యార్థులు ఉండగా, 2025–26 నాటికి ఆ సంఖ్య 16.58 లక్షలకు పడిపోయింది. ఈ నేపథ్యంలో కనీసం 10 శాతం మేర చేరికలు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అంటే దాదాపు 1.65 లక్షల మంది కొత్త విద్యార్థులు చేరితేనే లక్ష్యం నెరవేరుతుంది. ఈసారి రాష్ట్రంలోని 2,769 పాఠశాలల్లో ప్రీ–ప్రైమరీ తరగతులు ప్రారంభించనున్నందున 30 వేల నుంచి 40 వేల మంది చిన్నారులు కొత్తగా చేరే అవకాశం ఉందని అంచనా. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలనే సర్కార్ తాపత్రయం కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అధికమవుతున్నాయి. సమగ్ర శిక్ష, హెచ్‌సీయూ, యునిసెఫ్ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో 25 శాతం మంది ఉపాధ్యాయులు బోధనకు సగం లేదా అంతకంటే తక్కువ సమయం మాత్రమే కేటాయించగలుగుతున్నట్లు వెల్లడైంది. దసరా సెలవుల నాటికి ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలను పూర్తిచేసి, ఆ తర్వాత పూర్తిస్థాయిలో బోధనపై దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# సింగరేణికి కొత్త ఊపిరి

(మొదటి పేజీ తరువాయి)

తగ్గడంతో.. ఉత్పత్తి పడిపోయింది. దీంతో సింగరేణి వ్యాపారం కూడా తగ్గడంతో.. సింగరేణి ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రామగుండం బొగ్గు గని ప్రాజెక్టును కేంద్రం అంగీకరించడంతో.. సరికొత్త ఉత్సాహం నెలకొంది. మొత్తం రూ.2,194.05 కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న ఈ ఆర్‌జీ కోల్‌మైన్ ప్రాజెక్టులో 5403 మంది సింగరేణి ఉద్యోగులతోపాటు.. మరో 600 మంది కాంట్రాక్ట్ సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు.

రామగుండం ప్రాంతంలో పాత బొగ్గు గనులు మూతపడుతుండగా.. అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు వేరే ప్రాంతాల్లో పని కల్పించడంతోపాటు.. బొగ్గు ఉత్పత్తి తగ్గడంతో మళ్లీ పెంచేందుకు ఈ ఆర్‌జీ కోల్‌మైన్ ప్రాజెక్ట్ చాలా కీలకమని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రాజెక్టులో భాగంగా మొత్తం 5 గనుల్లో బొగ్గును తవ్వనున్నారు. అందులో రెండు ఉపరితల (ఓపెన్ కాస్ట్).. మరో 3 భూగర్భ గనుల (అండర్‌గ్రౌండ్ మైన్స్)లను తవ్వకం కోసం ఈ ప్రాజెక్టును రూపొందించారు. అక్కడ మొత్తం 314.98 మిలియన్ టన్నులకు పైగా బొగ్గు నిల్వలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈ ఆర్‌జీ కోల్‌మైన్ ప్రాజెక్టులో భాగంగా ప్రతీ సంవత్సరం 2.10 కోట్ల టన్నుల చొప్పున బొగ్గును 25 ఏళ్ల పాటు తవ్వాలని ప్రతిపాదనలు చేశారు. ఈ ప్రక్రియ ప్రారంభం అయితే.. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) తోపాటు బొగ్గు ఆధారిత పరిశ్రమలకు కూడా ఇంధన సరఫరా ఒప్పందాల ప్రకారం బొగ్గును సరఫరా చేయనున్నారు. ఇక.. గతంలో మూతపడిన జీడీకే–10 ఇంక్లైన్.. త్వరలో మూతపడే స్థితిలో ఉన్న వకీల్‌పల్లి భూగర్భ గనులను కూడా.. ఓపెన్ కాస్ట్ బొగ్గు గనులుగా మార్చి.. అక్కడ మిగిలి ఉన్న బొగ్గును కూడా పూర్తిగా వెలికితీయాలని ప్రతిపాదించారు.

అంతేకాకుండా ఈ గనులను ఆనుకొని పక్కనే ఉన్న రామగుండం ఓపెన్ కాస్ట్–1 విస్తరణ ప్రాజెక్టు ఫేజ్ 2.. రామగుండం ఓపెన్ కాస్ట్–2 విస్తరణ ప్రాజెక్టు.. అడ్రియాల షాఫ్ట్ అండర్ గ్రౌండ్ విస్తరణ ప్రాజెక్టుల అంచుల్లో మిగిలిపోయిన బొగ్గును కూడా పూర్తిగా తవ్వేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ మొత్తం ప్రాజెక్టులను అన్నింటినీ కలిపి రామగుండం కోల్‌మైన్ పేరుతో కొత్త ప్రాజెక్టుకు గతంలోనే రూపకల్పన చేసిన సింగరేణి సంస్థ.. వాటికి పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలంటూ.. కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. తక్కువ పెట్టుబడితో.. పర్యావరణానికి హాని జరగకుండా బొగ్గును ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా ఈ ఆర్‌జీ కోల్‌మైన్ ప్రాజెక్టును రూపొందించినట్లు కేంద్రానికి విన్నవించింది.

# విషాదం....

- భార్యతో గొడవపడి పిల్లలతో నిజాంసాగర్‌లో దూకిన తండ్రి
- భార్యతో గొడవపడి దారుణం..
- ముగ్గురి మృతదేహాలు వెలికితీత

**పీపుల్స్‌డైరీ–కామారెడ్డి :** కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ కుటుంబంలో జరిగిన చిన్న గొడవ ముగ్గురి ప్రాణాలు బలిగొంది. భార్యతో ఏర్పడిన మనస్పర్థల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన ఓ కన్నతండ్రి.. తన ఇద్దరు పసి బిడ్డలను చంకనేసుకుని నిజాంసాగర్ జలాశయంలోకి దూకేశాడు. సమాచారం అందుకున్న రెస్క్యూ బృందాలు నీటిపై తేలుతున్న ఆ అమాయక చిన్నారుల మృతదేహాలతోపాటు తండ్రి మృతదేహాన్ని బయటకు తీశారు.

స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల కేంద్రానికి చెందిన 32 ఏళ్ల కృష్ణ అనే వ్యక్తికి, సవిత అనే మహిళతో వివాహం జరిగింది. వీరికి 8 ఏళ్ల రక్షిత్ అనే కుమారుడు, ఐదేళ్ల వయసున్న అనన్య అనే కుమార్తె ఉన్నారు. అయితే కొంతకాలంగా కృష్ణ, సవిత దంపతుల మధ్య ఏదో ఒక విషయంలో నిరంతరం గొడవ జరుగుతూనే ఉంది. ఈ క్రమంలోనే తాజాగా గురువారం వీరిద్దరి మధ్య మరోసారి తీవ్రమైన గొడవ, వాగ్వాదం చోటుచేసుకుంది. భార్యతో జరిగిన ఈ గొడవతో తీవ్ర మనస్తాపానికి గురైన కృష్ణ.. ఎలాగైనా ప్రాణాలు తీసుకోవాలనే ఘోర నిర్ణయానికి వచ్చాడు. ఇంట్లో ఉన్న ఇద్దరు పిల్లలైన రక్షిత్, అనన్యలను తీసుకుని నేరుగా కామారెడ్డి జిల్లా పరిధిలోని నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రాంతానికి చేరుకున్నాడు.

**పిల్లలను నెట్టేసి.. తండ్రి కూడా దూకేసి!**

జలాశయం వద్దకు చేరుకున్న కృష్ణ.. పసిపిల్లలని కూడా చూడకుండా రక్షిత్, అనన్యలను నీటిలోకి నెట్టేసి.. ఆపై అతడు కూడా నీటిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు బలంగా అనుమానిస్తున్నారు. అయితే ప్రాజెక్టు పరిసరాల్లో వీరి కదలికలను గమనించిన స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కామారెడ్డి జిల్లా పోలీసులు, రెస్క్యూ, విపత్తు నిర్వహణ సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. రంగంలోకి దిగిన గజ ఈతగాళ్లు, రెస్క్యూ బృందాలు జలాశయంలో గాలింపు చర్యలు చేపట్టి వారి మృతదేహాలను బయటకు తీశారు.

(మొదటి పేజీ తరువాయి)

# గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు..

పరిణామాలపై నిరంతర పర్యవేక్షణను కొనసాగిస్తోందని తెలిపింది. తీవ్రమైన భౌగోళిక రాజకీయ అనిశ్చితి నెలకొన్న ఈ సమయంలో, భారతీయ నావికులకు, వారి కుటుంబాలకు భారత ప్రభుత్వం దృఢంగా అండగా నిలుస్తుందని , వారి సంక్షేమం, భద్రత, శ్రేయస్సును నిర్ధారించడానికి అవసరమైన అన్ని చర్యలను కొనసాగిస్తుందని పునరుద్ఘాటిస్తోంది.. అని ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

ప్రకటన ప్రకారం.. "భారత నావికులకు సకాలంలో మద్దతు, సహాయం అందేలా చూసేందుకు ప్రభుత్వం, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత నౌకాదళం, విదేశాల్లోని భారత మిషన్లు, మిత్ర దేశాల సముద్ర పరిపాలన సంస్థలు, షిప్పింగ్ కంపెనీలు, నావికుల సంక్షేమ సంస్థలు, ఇతర సంబంధిత భాగస్వాములతో సన్నిహితంగా సమన్వయం చేసుకుంటోంది." ఈ ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న వాణిజ్య నౌకలకు సంబంధించి ఇటీవల జరిగిన భద్రతా సంఘటనలు, వాణిజ్య నౌకాయానం ఎదుర్కొంటున్న పెరుగుతున్న ప్రమాదాలను వెలుగులోకి తెచ్చాయి. ప్రపంచ వాణిజ్యానికి, ఇంధన భద్రతకు ఈ అంతర్జాతీయ నౌకాయాన మార్గాల వ్యూహాత్మక ప్రాముఖ్యతను గుర్తించి, భారతీయ నావికులు లేదా భారతీయ సముద్ర ప్రయోజనాలకు సంబంధించిన ఏ ఆకస్మిక పరిస్థితికైనా స్పందించేందుకు సిద్ధంగా, అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సంబంధిత ఏజెన్సీలన్నింటినీ ఆదేశించింది" అని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ ప్రకటనలో తెలిపింది. సంఘర్షణ ప్రభావిత జలాల గుండా ప్రయాణించే భారతీయ, విదేశీ జెండాలు గల నౌకలలో పనిచేస్తున్న భారతీయ నావికులందరూ అత్యంత జాగ్రత్త, అప్రమత్తతతో ఉండాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ సూచించింది.

# ఈ నెల 20, 21 తేదీల్లో గాంధీనగర్‌లో కబడ్డీ క్రీడోత్సవాలు

## కరపత్రం ఆవిష్కరణ



**భీమదేవరపల్లి జూన్ 12 (పీపుల్స్ డైరీ ) :** ఉమ్మడి కరీంనగర్ ఉమ్మడి వరంగల్ జిల్లాల స్థాయి గ్రామీణ కబడ్డీ క్రీడోత్సవాలు ఈ నెల 20, 21 తేదీలలో భీమదేవరపల్లి మండలం గాంధీనగర్ గ్రామంలో ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. గాంధీనగర్ గ్రామ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో,ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ కె. సుహాసిని ప్రత్యేక సహకారంతో ఈ టోర్నమెంట్ జరగనుందని తెలిపారు. ఈ క్రీడోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... నేటి యువత ఆత్మనూనతా భావంతో ఆత్మస్థైర్యం కోల్పోయి, తీవ్ర మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు యువకులు డ్రగ్స్, ఆన్‌లైన్ గేమింగ్,మద్యానికి బానిసలై ఆత్మహత్యలకు పాల్పడుతుంటే,మరికొందరు అతివేగంతో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతూ కుటుంబాల్లో తీరని దుఃఖాన్ని మిగులుస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యువతలో మానసిక దృఢత్వాన్ని, క్రీడా స్ఫూర్తిని నింపాలనే సత్సంకల్పంతో గాంధీనగర్ గ్రామ యువకులు ఈ కబడ్డీ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. రెండు జిల్లాల పరిధిలోని క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న నిర్వహణ కమిటీని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ కే.సుహాసిని ,ఉపసర్పంచ్ బుర్ర సమ్మయ్య ,వార్డు సభ్యులు తూముల ఎల్లయ్య, తాళ్లపల్లి చిన్న రాజయ్య, నిర్వహణ కమిటీ సభ్యులు తాళ్లపల్లి కుమారస్వామి, తాళ్లపల్లి అరవింద్, తాళ్లపల్లి అశోక్, గాజపాక అజయ్, బత్తుల సాహూ, గ్రామ ప్రముఖులు తాళ్లపల్లి రాజయ్య, గడ్డం కనకయ్య, తాళ్లపల్లి సారయ్య, తాళ్లపల్లి శ్రీనివాస్, సిగ చిరంజీవి, స్థానిక గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈ నెల 16న కొత్తకొండ వీరభద్రస్వామి దేవస్థాన భూముల కౌలు వేలంపాట

**భీమదేవరపల్లి జూన్ 12 (పీపుల్స్ డైరీ ) :** భీమదేవరపల్లి మండలం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానానికి చెందిన పట్టా సాగు భూములకు ఈ నెల 16వ తేదీన బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. కిషన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు.మంగళవారం 16.06.2026 ఉదయం 10:30 గంటలకు ఆలయ కార్యాలయ ప్రాంగణంలో ఈ వేలం ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు.దేవస్థానానికి చెందిన వివిధ సర్వే నెంబర్లలోని దాదాపు 5 ఎకరాల పైచిలుకు సాగు భూములను ఒక సంవత్సరం కాలపరిమితికి (తేది 19.06.2026 నుండి 18.06.2027 వరకు) సాగు చేసుకునేందుకు ఈ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. కొత్తకొండ పరిధిలోని క్రింది సర్వే నెంబర్ల భూములకు వేలం జరగనుంది:సర్వే నెం.12/2: 1.00 ఎకరం (డిపాజిట్: రూ. 3,000/-) సర్వే నెం. 35: 0-09 గుంటలు (డిపాజిట్: రూ. 1,000/-) సర్వే నెం. 37: 1-03 ఎకరాలు (డిపాజిట్: రూ. 3,000/-) సర్వే నెం. 39: 1-02 ఎకరాలు (డిపాజిట్: రూ. 3,000/-) సర్వే నెం. 42: 0-29 గుంటలు (డిపాజిట్: రూ. 1,000/-) వేలం పాటలో పాల్గొనాలనుకునేవారు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డ్,ఖాళీ బ్యాంక్ చెక్ వెంట తీసుకురావాలి.నిర్ణీత డిపాజిట్ సొమ్ము చెల్లించిన వారికే వేలం పాటలో పాల్గొనే అవకాశం ఉంటుంది.వేలం ముగిసిన తర్వాత హెచ్చు పాటదారుడు మినహా మిగతా వారి డిపాజిట్ సొమ్మును తిరిగి ఇచ్చివేయబడుతుంది.అత్యధిక పాట పాడుకున్న వ్యక్తి వేలం ముగియగానే డిపాజిట్ కాకుండా,మిగిలిన మొత్తంలో 50% సొమ్మును వెంటనే చెల్లించాల్సి ఉంటుంది. మిగతా సగం సొమ్మును 6 నెలల కాలపరిమితిలో చెల్లించుటకు సంతకం చేసిన ఖాళీ చెక్ సమర్పించాలి. ఈ వేలంపాటలు దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టం 30/1987కు లోబడి, హనుమకొండ జిల్లా దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించబడతాయని తెలిపారు.ఆసక్తి కలిగిన వారు ఈ వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

# సైదాపూర్ పీఎస్‌పై సీపీ గౌస్ అల్లం ఆకస్మిక తనిఖీ



**సైదాపూర్ జూన్ 12 ( పీపుల్స్ డైరీ) :** కరీంనగర్ జిల్లా సైదాపూర్ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణ, రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## పెండింగ్ కేసులపై సమీక్ష

స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను పరిశీలించిన సీపీ, దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని అధికారులను ఆదేశించారు. రికార్డులు పకడ్బందీగా సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని సూచించారు.

## గ్రామాల్లో నిఘా పెంపు

స్టేషన్ పరిధిలోని గ్రామాలను సెక్టార్లు, సబ్‌సెక్టార్లుగా విభజించి ప్రతి గ్రామానికి గ్రామ పోలీస్ అధికారులను కేటాయించాలని ఆదేశించారు.

## రౌడీ షీటర్లపై నిఘా

రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వారి వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. సిబ్బందికి కీలక సూచనలు రిసెప్షన్, కోర్టు డ్యూటీ, బీట్, పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో సిబ్బంది నైపుణ్యం పెంపొందించుకోవాలని సీపీ సూచించారు. మహిళా సిబ్బందికి వసతులు మహిళా సిబ్బంది విశ్రాంతి గదుల సౌకర్యాలపై ఆరా తీసిన సీపీ, అవసరమైన మరమ్మత్తులు చేపట్టి మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. తనిఖీ అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో సీపీ గౌష్ ఆలం మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసీపీ మాధవి, రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్‌హెచ్‌వో కొప్పుల స్వాతి, ఇతర అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల విద్యలో సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ డిమాండ్

## మేడ్చల్ కలెక్టరేట్ ముట్టడితో ఉద్రిక్తత




**మేడ్చల్, జూన్ 12(పీపుల్స్ డైరీ):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తూ విద్యా రంగ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ విద్యార్థి నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్యామ్ కిరణ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దాదాపు 12 సంవత్సరాలు గడిచినా పాఠశాల విద్యా వ్యవస్థలో అనేక సమస్యలు కొనసాగుతున్నాయని విమర్శించారు. రేషనలైజేషన్ పేరుతో వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారని, అనేక పాఠశాలలు ఇప్పటికీ ఏకోపాధ్యాయ పాఠశాలలుగానే కొనసాగుతున్నాయని ఆరోపించారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందని, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, తరగతి గదులు వంటి కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ విద్యార్థులకు యూని ఫార్ములు, పాఠ్యపుస్తకాలు అందకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని, కొందరు విద్యాసంస్థలు 'ఇంటర్నేషనల్ స్కూల్స్' పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రతి ఏడాది ఫీజులను భారీగా పెంచుతూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే రాష్ట్రంలో డీఈవోలు, ఎంఈవోల కొరత కారణంగా విద్యా వ్యవస్థ పర్యవేక్షణ దెబ్బతింటోందని, అనేక మండలాల్లో ఇన్‌చార్జి ఎంఈవోలతోనే వ్యవహారాలు నడుస్తున్నాయని తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకుల పాఠశాలలు కొన్ని ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, విద్యార్థుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.పాఠశాల విద్యలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని ఏబీవీపీ నాయకులు హెచ్చరించారు.

## ఏబీవీపీ ప్రధాన డిమాండ్లు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను వెంటనే కల్పించాలి.ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకువచ్చి ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలి.నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి. డీఈవో, ఎంఈవో పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు చేపట్టాలి. గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలి. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ నగేష్, ఎస్‌డబ్ల్యూసీ సభ్యులు అఖిల్, జిల్లా కన్వీనర్లు మృతుంజయ్, బాలు, భరత్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు. విద్యా వ్యవస్థలో లోపాలపై ఏబీవీపీ గళమెత్తిందిమేడ్చల్‌లో జరిగిన ఈ ఆందోళన ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఏబీవీపీ ప్రయత్నించింది. విద్యార్థులకు నాణ్యమైన విద్య, తగిన మౌలిక వసతులు కల్పించాలనే డిమాండ్‌తో చేపట్టిన ఈ ముట్టడి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

# గంగ వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు వెంటనే ప్రారంభించాలి: బీజేపీ డిమాండ్

## తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పణ



**మేడ్చల్, జూన్ 12(పీపుల్స్ డైరీ) :** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గంగ వెంచర్‌లో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయం లో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకురాలు జల్లి శైలజ హరినాథ్ మాట్లాడుతూ, గంగ వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన అనేక మంది కుటుంబాలు రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు పాతూరి ప్రభాకర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా నాయకులు బొజ్జ రాఘవ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, జకట ప్రేమ దాసు, ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి, సర్వేశ్వర రెడ్డి, కార్యదర్శి బండి విష్ణు, సీనియర్ నాయకులు ధాత్రిక లక్ష్మణ్ వంజరి, మహిళా నాయకులు తోట అనిత, అనిత, నాయకులు బొజ్జ వంశీ రెడ్డి, జకట బాబు రాజు, చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, మహేష్ గౌలికర్, పురుషోత్తం, మల్లికార్జున్, ఎన్.ఎస్. గౌడ్ తదితరులు పాల్గొన్నారు.బీజేపీ నాయకులు ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని, గంగ వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ వ్యవహారాన్ని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.


# చిరుతల రామాయణ నాటక ప్రదర్శన




**చిగురుమామిడి,జూన్12 (పీపుల్స్ డైరీ):** మండలంలోని కొండాపూర్ గ్రామంలో గత రెండు రోజులుగా చిరుతల రామాయణ నాటక ప్రదర్శన అంగరంగ వైభవంగా జరిగింది బోధకులుగా శనిగరం మల్లేశం వ్యవహరించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొండాపూర్ గ్రామ సర్పంచ్ మార్క రాజ్ కుమార్ గౌడ్,కళాకారుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్ లు హాజరై టెంకాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు కొండాపూర్ గ్రామ కళాకారులు గ్రామస్తుల సహకారంతో పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించి ఆయా పాత్రల వేషధారణతో కళ్ళకు కట్టినట్టు రామాయణ గాధను ప్రదర్శించారు గ్రామ ఉప సర్పంచ్ బింగి రాజేంద్రప్రసాద్ వార్డ్ మెంబర్లు, పాలకవర్గం, ప్రజా ప్రతినిధులు గ్రామ ముఖ్య నాయకులు పాల్గొన్న ఈ ప్రదర్శనలో బింగి లక్ష్మీనారాయణ,చీకుట్ల రాజు,గూళ్ళ సంపత్,గుళ్ళ కనకయ్య, గూడెపు రామస్వామి, దరిపెల్లి మల్లేష్, దరిపెల్లి విష్ణు, పెద్దపెల్లి జనార్ధన్, వేమునూరు సంపత్, గూడెపు చంద్రయ్య, గూడెపు ఆంజనేయులు, పైడిపల్లి గంగయ్య,బండి ఆంజనేయులు,కట్ట ఎల్లయ్య, గంటల అశోక్, గూడెపు రాజు,కొత్త తిరుపతి,వంగర సత్తయ్యలు వివిధ పాత్రలతో వేషధారణ చేసి పద్యాలు పాటలతో అందరినీ మైమరిపించేలా నాటక ప్రదర్శన చేశారు ఈ కార్యక్రమంలో సుందరగిరి, చిగురుమామిడి, నవాబుపేట, గొట్లమిట్ట, హుస్నాబాద్, గాగిరెడ్డిపల్లి, పొట్లపల్లి తదితర గ్రామాల కళాకారులు పాల్గొన్నారు.

# 2026-27 విద్యా సంవత్సరానికి 2వ విడత ప్రవేశాలు

## ప్రభుత్వ రూరల్ ఐటీఐ ఏటూరునాగారం మరియు ఐటీఐ వాజేడు సంస్థలలో



**ఏటూరు నాగారం జూన్ 12 )పీపుల్స్ డైరీ :** ప్రభుత్వ రూరల్ ఐటీఐ, ఏటూరునాగారం ఒ ములుగు జిల్లా కన్వీనర్ కార్యాలయం ములుగు జిల్లా యువతకు శుభవార్త. ప్రభుత్వ రూరల్ ఐటీఐ ఏటూరునాగారం మరియు ప్రభుత్వ ఐటీఐ వాజేడు సంస్థలలో 2026-27 విద్యా సంవత్సరానికి 2వ విడత ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రభుత్వ రూరల్ ఐటీఐ ఏటూరునాగారం ప్రిన్సిపాల్ మరియు ములుగు జిల్లా కన్వీనర్ శ్రీ ఎస్. జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ప్రభుత్వ ఐటీఐలు మరియు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ట్రేడ్లలో ప్రవేశాల కోసం ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 8వ తరగతి, 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను అధికారిక వెబ్‌సైట్ https://iti.telangana.gov.in/ ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. తెలంగాణలోని ప్రభుత్వ ఐటీఐలు, రూరల్ ఐటీఐలు, ఏ టి సిలు మరియు ఇతర ఐటీఐలలో ప్రవేశాలు ఆన్లైన్ విధానంలో నిర్వహిం చబడు తున్నాయి.దరఖాస్తు చేసుకోవడానికి చివరి ములుగు జిల్లా పరిధిలోని అర్హులైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలను పొందాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్



**హుజురాబాద్, జూన్ 12, (పీపుల్స్ డైరీ) :** హుజురాబాద్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా షోరూమ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసిన చైర్‌పర్సన్, సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు వ్యాపార రంగం మరింత విస్తరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ ఎం.డి. ఖలీక్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యాపారవేత్తలు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి చేయూత

## సర్పంచ్ అంబాల రాజకుమార్




**ఎల్కతుర్తి జూన్ 12 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన సందెల విరయ్య ఇటీవలే మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించిన గ్రామ సర్పంచ్ అంబాల రాజు మానవతా దృక్పథంతో స్పందించారు. మృతుడి భార్య సందెల సౌందర్యకు కుటుంబ పోషణకు తోడ్పాటుగా 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంబాల రాజు మాట్లాడుతూ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కడారి రాజరాం సాతూరి ఐలయ్య దాసరపు రాజమౌళి నల్లగొండ శివప్రసాద్ బొంకూరి అనిల్ గొర్రె శ్రీనివాస్ కడారి రవీందర్ కోరే రవి తదితరులు పాల్గొన్నారు.

# డిఈఓ ను కలిసిన జిల్లా ఆంగ్ల ఉపాధ్యాయుల సంఘం



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) జూన్ 12 :** సిద్దిపేట జిల్లా నూతన జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఓరుగంటి శాస్త్రి ని సిద్దిపేట జిల్లా ఆంగ్ల ఉపాధ్యాయుల సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆంగ్ల భాషా నైపుణ్యాల అభివృద్ధికి అకాడమిక్ పరంగా ఎల్లప్పుడూ కృషి చేస్తామని ఉపాధ్యాయులు డీఈఓకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ కోఆర్డినేటర్ పయ్యావుల రామస్వామి, జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ దొంతుల నర్మద, ఆంగ్ల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు పంజ రాజమల్లు, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్, ఉపాధ్యక్షుడు ఎర్ర పార్థసారథి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ముత్యాల సురేందర్ రెడ్డి, మానుక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# నార్కోటిక్ డాగ్స్‌తో కొమురవెల్లిలో ముమ్మర తనిఖీలు-ఎస్ఐ మహేష్



**చేర్యాల రూరల్, జూన్ 12:** సిద్దిపేట జిల్లాను గంజాయి ఇతర మత్తుపదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ ఆదేశాల మేరకు శుక్రవారం కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామంలో నార్కోటిక్ డాగ్స్‌తో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని కిరాణా షాపులు, టీకొట్టులు, పాన్ షాపులు ఇతర అనుమానాస్పద ప్రాంతాలలో ఈ సోదాలు జరిగాయి. ఈ సందర్భంగా కొమురవెల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ మహేష్ మాట్లాడుతూ యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తుపదార్థాల సరఫరా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్, లేదా మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్లను ఎవరైనా కలిగి ఉన్నా, అక్రమంగా రవాణా చేసినా, లేదా షాపుల్లో విక్రయించినా చట్టప్రకారం కఠిన కేసులు నమోదు చేయడం జరుగుతుందని, జిల్లాను గంజాయి రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలనీ కోరారు. మీ ప్రాంతంలో ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తుపదార్థాలను విక్రయించినా, కలిగి ఉన్నా వెంటనే డయల్ 100 లేదా 1908 నంబర్లకు సమాచారం అందించగలరు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని ఎస్ఐ మహేష్ తెలియజేశారు.

# దుబాయ్‌లో మెదక్ వాసి గుండెపోటుతో మృతి

**ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన మెదక్ జిల్లా వాసి సాయికిరణ్ మృతి**



ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన ఓ తెలంగాణ యువకుడు గుండెపోటుతో అకాల మరణం చెందాడు. మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన చింతకింది సాయి కిరణ్ (35) దుబాయ్‌లో మృతిచెందడంతో అతని కుటుంబంలో, గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం సాయికిరణ్‌కు నాగలక్ష్మితో వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పోషణ కోసం గతేడాది మే నెలలో ఆయన దుబాయ్‌కు వెళ్లాడు. అక్కడ పనిచేస్తుండగా, ఈ నెల 2వ తేదీన తీవ్రమైన గుండెపోటు రావడంతో మరణించాడు. ఈ విషయం ఆలస్యంగా కుటుంబ సభ్యులకు తెలియడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సాయికిరణ్ మరణ వార్తతో వడియారం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయామని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాయికిరణ్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి తెప్పించాలని కోరుతూ ఆయన కుటుంబ సభ్యులు 'సీఎం ప్రవాసీ ప్రజావాణి'ని ఆశ్రయించారు. తమకు సహకరించి, మృతదేహాన్ని భారత్‌కు తరలించే ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# క్రైస్తవ స్మశాన వాటికలో మెరుగైన వసతుల కోసం పరమేశ్వర్ రెడ్డికి వినతి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (ఉప్పల్), జూన్ 12 :** చిలుక నగర్ డివిజన్ పరిధిలోని క్రైస్తవ స్మశాన వాటికలో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేయాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డిని కోరడం జరిగింది. చిలుక నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం పరమేశ్వర్ రెడ్డిని కలిసి స్మశాన వాటికలో నెలకొన్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలోనే అందుకు కావాల్సిన కార్యాచరణను చేపడుతానని హామీ ఇచ్చారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన వసతుల మెరుగుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించాడు. ఈ కార్యక్రమంలో చిలుక నగర్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ నల్లవెల్లి మహేందర్ కమిటీ సభ్యులు పి కిష్టయ్య, మారపాక నాగయ్య, బలరాం, నాగేశ్వరరావు, పల్నాటి దేవిడ్ పాల్గొనడం జరిగింది.

# పాడుబడిన ప్రభుత్వ భవనాలు.. ప్రజలకు ప్రమాద ఘంటికలు

- **"మేడ్చల్‌లో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు -- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్న వైనం**
- **నాచారం విజయలక్ష్మి**






**మేడ్చల్, జూన్ 12(పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం, సంబంధిత శాఖల ఉదాసీనత కారణంగా మేడ్చల్ పట్టణంలోని పలు ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకుని ప్రజలకు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఒకప్పుడు విద్యార్థుల చదువులకు కేంద్రంగా నిలిచిన ప్రభుత్వ పాఠశాల భవనాలు నేడు పాడుబడి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో ఫోరం ఫర్ ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణంలోని పాడుబడిన ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలను పరిశీలించారు. జిల్లా అధ్యక్షురాలు నాచారం విజయలక్ష్మి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి. మేడ్చల్ పట్టణంలోని అర్జున్‌వాడ ప్రాంతంలో రథంశాల సమీపంలో, అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా ఉన్న పాడుబడిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ప్రతినిధులు సందర్శించారు. ఈ భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని స్థానికులకు ఇబ్బందిగా మారిందని వారు పేర్కొన్నారు. మాజీ వార్డు సభ్యుడు గల్వ మహేష్ మాట్లాడుతూ, ఇళ్ల మధ్యలో ఉన్న ఈ భవనం రాత్రి వేళల్లో అసాంఘిక శక్తులకు నిలయంగా మారిందని ఆరోపించారు. చిన్నారులు, మహిళలు సంచరించే ప్రాంతంలో ఇలాంటి శిథిల భవనం ఉండటం ప్రజల భద్రతకు ముప్పుగా మారిందన్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే ప్రాంతంలో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ షాపులు కూడా ప్రజలకు మరో సమస్యగా మారాయని గల్వ మహేష్ తెలిపారు. బెల్ట్ షాపుల వల్ల యువత చెడు అలవాట్లకు బానిసలవుతుండటంతో పాటు శాంతిభద్రతలకు భంగం కలుగుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫోరం ఫర్ ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ గుప్తా మాట్లాడుతూ, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. పాడుబడిన ప్రభుత్వ భవనాలను వెంటనే తొలగించడం లేదా ప్రజా అవసరాలకు అనుగుణంగా పునర్వినియోగం చేయాలని ప్రభుత్వా న్ని కోరారు. ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన ప్రభుత్వ ఆస్తులు నిర్లక్ష్యానికి గురికావడం బాధాకరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదకరంగా మారిన భవనాలపై అధికారులు తక్షణ చర్యలు తీసుకుని ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతకు భరోసా కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ గుప్తా, జిల్లా అధ్యక్షురాలు నాచారం విజయలక్ష్మి, ఎం. లావణ్య, మేడ్చల్ విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, నర్సింహులు పటేల్, మాజీ వార్డు సభ్యుడు గల్వ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కిషన్‌రెడ్డి.. సింగరేణి అవినీతిలో మీ భాగస్వామ్యం ఏమిటి?

- **సింగరేణిని కాంగ్రెస్ ఖతం పట్టించింది**
- **అవినీతి, కుంభకోణాలతో సింగరేణి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం ఖతం పట్టించిందని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు.**
- **సింగరేణిని కాంగ్రెస్ ఖతం పట్టించింది**
- **నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయి: హరీశ్ రావు**
- **రేవంత్‌రెడ్డిది 'జల ద్రోహం'.. ఏపీకి గోదావరి నీళ్లు తరలించే కుట్ర: హరీశ్‌రావు**



**భూపాలపల్లి జూన్ 12 పీపుల్స్ డైరీ :** అవినీతి, కుంభకోణాలతో సింగరేణి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం ఖతం పట్టించిందని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. ఇంతగా అవినీతి జరుగుతున్నా కేంద్ర ఇంధన శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ఉదాసీనంగా వ్యవహరించడం వెనుక ఆంతర్యమే మిటని ప్రశ్నించారు. సింగరేణి కుంభకోణాల్లో రేవంత్‌రె డ్డితో మీకున్న భాగస్వామ్యం ఏమిటని కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఈడీ, విజిలెన్స్‌ల తో విచారణ జరిపిస్తే సింగరేణిలో జరిగిన అవినీతిపై పూర్తి ఆధారాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని చె ప్పారు. శుక్రవారం భూపాలపల్లి తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూపాలపల్లి బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సింగరేణి పరిరక్షణ సదస్సులో హరీశ్ రావు, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదన చారి పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఆయన పవర్ ప్రజంటేషన్ సమర్పించి మాట్లాడారు. సింగరేణి సంస్థలో కేంద్ర ప్రభుత్వానికి 49శాతం వాటా ఉన్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. కేసీఆర్ హయాంలో 19,500మందికి డిపెండెంట్ ఉద్యోగాల కల్పన జరిగితే కాంగ్రెస్ ఏడాదిన్నరగా మెడికల్ బోర్డును నిలిపివేసి సింగరేణిలో కొత్త ఉద్యోగాల్లో కోత పెట్టిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో తెలంగాణ జల హక్కులను పొరుగు రాష్ట్రానికి తాకట్టు పెడుతోందని, సీఎం రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా తెలంగాణ జల ద్రోహానికి పాల్పడుతున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. నదుల అనుసంధానం పేరుతో మన రాష్ట్రాన్ని పక్కన పెట్టి.. రాత్రికి రాత్రి ఏపీకి గోదావరి జలాలను తరలించే కుట్ర జరుగుతోందన్నారు. బనకచర్ల నల్లమలసాగర్ ఫె యిల్ కావడంతో ఇప్పుడు గోదావరి-కావేరి అనుసంధానం ప్రాజెక్టు పేరుతో ముందుకు వచ్చారన్నారు. ఏపీ ప్రతిపాదనపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఇతర బీజేపీ ఎంపీలు తెలంగాణ ద్రోహులుగా మిగిలిపోతారా? అని నిలదీశారు.

**హిట్లర్‌కు పట్టిన గతే రేవంత్‌కు..**

హిట్లర్‌ను చూసి హైడ్రా తెచ్చాను అంటున్న సీఎం రేవంత్ రెడ్డి నయా హిట్లర్‌గా మారాడని, నాడు హిట్లర్‌కు ఏ గతి పట్టిందో.. రేవంత్ రెడ్డికి కూడా అదే గతి పడుతుందని హరీశ్ రావు అన్నారు. రైతు డిస్కం పేరుతో 24 గంటల ఉచిత కరెంటుకు ఉరి వేయబోతున్నారని చెప్పారు. ఇక వ్యవసాయానికి 7, 8 గంటలకు మించి కరెంట్ రాదని ఆయన పేర్కొన్నారు.

# మేడ్చల్‌లో ఘనంగా ప్రారంభమైన మల్లారెడ్డి పాఠశాల



- **పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే మల్లారెడ్డి**

**మేడ్చల్, జూన్ 12(పీపుల్స్ డైరీ) :** పేద మరియు మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు అతి తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందించడమే తన జీవిత ఆశయమని మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి స్పష్టం చేశారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్ పరిధిలోని సరస్వతి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన "మల్లారెడ్డి పాఠశాల"ను ఆయన రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుని, హాజరైన వారిని ఎంతగానో అలరించాయి. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి భారీ మెజారిటీతో గెలిపించిన మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలతో పాటు వారి పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వరుసగా పాఠశాలలు, కళాశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే సంకల్పంతో, కార్పొరేట్ స్థాయి విద్యను అందరికీ అందు బాటులో ఉండేలా తక్కువ ఫీజులతో అందిస్తున్నామని చెప్పారు. విద్య అనేది సమాజ అభివృద్ధికి ప్రధాన ఆయు ధమని పేర్కొన్న ఆయన, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల విద్యార్థులు సమాన అవకాశాలు పొందేలా విద్యాసంస్థలను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, మేడ్చల్ మండల భరాసా మాజీ అధ్యక్షుడు చీర్ల దయానంద్, ఎల్లంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ లావుడియా శ్రీదేవి రమేష్ నాయక్, మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, అప్పమ్మగారి జగన్ రెడ్డి, రాజ మల్లారెడ్డి, గోమారం శ్రీనివాసరెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ సభ్యుడిగా నియమితులైన సబ్బని రమేష్‌కు ఘన సన్మానం



**హుజురాబాద్, జూన్ 12: (పీపుల్స్ డైరీ) :** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (జదీఖీజ) సభ్యుడిగా నియమితులైన హుజురాబాద్‌కు చెందిన సబ్బని రమేష్‌ను తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకమారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. హుజురాబాద్ పట్టణంలోని స్థానిక టీఆర్ఏ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు సామాజిక, రాజకీయ నాయకులు పాల్గొని రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, తెలంగాణ ఫిల్మ్ అండ్ టీవీ డిజిటల్ డెవలప్‌మెంట్ జేఏసీ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజర్ సందేల వెంకన్న మాట్లాడుతూ, హుజురాబాద్‌కు చెందిన పద్మశాలి ముద్దుబిడ్డ సబ్బని రమేష్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ సభ్యుడిగా నియమితులు కావడం గర్వకారణమన్నారు. గత రెండు దశాబ్దాలుగా భారతీయ జనతా పార్టీ కోసం ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ పదవి లభించిందని పేర్కొన్నారు. ఆయన నియామకం ద్వారా హుజురాబాద్‌కు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించిందన్నారు. ఫిల్మ్ బోర్డు సభ్యుడిగా మంచి చిత్రాలకు ప్రోత్సాహం అందిస్తూ, సమాజానికి ఉపయోగపడే చిత్రాలకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు సబ్బని రాజేందర్, బీసీ ఆజాదీ ఫెడరేషన్ అధికార ప్రతినిధి ఇప్పకాయల సాగర్, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మార్త రవీందర్, కుడికాల ప్రభాకర్, గాలి సమ్మయ్య, తాటిపాముల దేవేందర్, కె.ఆర్. భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద కోమటిపల్లి గ్రామానికి దక్కిన అరుదైన గౌరవం

- తెలంగాణ భూ రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా మంద సాంబయ్య
- సంబరాలు చేసుకున్న ప్రజానీకం

**ఉమ్మడి వరంగల్ జూన్ 12 :** పెద్ద కోమటిపల్లి గ్రామానికి అరుదైన గౌరవం దక్కింది. ఆ గ్రామానికి చెందిన మంద సాంబయ్యను తెలంగాణ భూ రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. పోరాట పటిమ కలిగిన మంద సాంబయ్య భారతీయ జనతా పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించి, మొగుళ్ళపల్లి మండలంలో పార్టీని బలోపితం చేసి, అధికార పార్టీకి ధీటుగా భారతీయ జనతా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి, బీజేపీలో నూతన ఉత్తేజం తెచ్చి.. ఎంతోమంది యువకులు ప్రజా ప్రతినిధులుగా గెలుపొం దడంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించి.. తెలంగాణ బీజేపీలో మొగుళ్లపల్లి మండలాన్ని ముం దుంచడ ంలో ఆయన విశేష కృషి చేశాడు. అనం తరం జరిగిన పరిణామాల నేపథ్యంలో..తెలంగాణ ప్రజలంతా స్వరాష్ట్ర ఆకాంక్ష మేరకు ఉద్యమిస్తుంటే..ప్రజల కోరిక



మేరకు ఉద్యమ పార్టీని ఎంచుకొని..కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్ లో చేరి..బంగారు తెలంగాణ దిశగా నాటి ప్రజా ప్రతినిధులతో కలిసి ముందడుగు వేశారు. ఈ క్రమంలో ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న బీఆర్ఎస్ పార్టీని వీడి ప్రజా పాలన-ప్రగతి నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ..ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరి..భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు గెలుపులో క్రియాశీలక పాత్ర పోషించాడు. వివిధ రాజకీయ పార్టీలతో, నాయకులతో, ప్రజా ప్రతినిధులతో తస్సంబంధాలు కలిగిన నేతగా మంచి గుర్తింపు ఉన్న మంద సాంబయ్య అసైన్డ్ భూమి కలిగిన రైతులకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు కృషి చేస్తాడని భావించిన తెలంగాణ భూ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య ఈ మేరకు నియామక ఉత్తర్వులను జారీ చేశాడు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన మంద సాంబయ్య విలేకరులతో మాట్లాడారు. తనపై నమ్మకంతో ఈ బృహత్తరమైన బాధ్యతలను అప్పగించిన తెలంగాణ భూ రక్షణ సమితి రాష్ట్ర నాయకుల సూచనల మేరకు అసైన్ భూమి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీనిచ్చారు.

# మీనాక్షి రాజ్యసభ నామినేషన్ వివాదంపై సిట్ విచారణ జరిపించండి: కేటీఆర్ ఎద్దేవా

- ప్రతి అంశానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ దర్యాప్తులు ఏర్పాటు చేస్తోందన్న కేటీఆర్
- మీనాక్షికి వ్యతిరేకంగా కొందరు కాంగ్రెస్ నేతలు వ్యవహరించి ఉండొచ్చని వ్యాఖ్య

పార్టీ ద్రోహులను రాహుల్ గాంధీ గుర్తించాలని సూచన

కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అంశానికీ సిట్ దర్యాప్తులు ఏర్పాటు చేస్తోందని, అదే విధంగా ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ అభ్యర్థిత్వానికి సంబంధించిన వివాదంపైనా సిట్ విచారణ జరపాలని వ్యంగ్యం ప్రదర్శించారు. మీనాక్షి నటరాజన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌లోనే కొందరు నాయకులు వ్యవహరించి ఉండవచ్చని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ అంశాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లింది కూడా కాంగ్రెస్ వర్గాలేనని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్‌లో ఉన్న అంతర్గత విభేదాలు, వర్గపోరాటాలే ఈ పరిస్థితులకు కారణమని పేర్కొన్నారు. పార్టీ ద్రోహులు ఎవరో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గుర్తించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై కూడా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఉన్న హైదరాబాద్ నగర సమస్యలను పరిష్కరించకుండా భవిష్యత్ నగరాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. తాజాగా కురిసిన వర్షాలతో నగరంలో ఏర్పడిన పరిస్థితులు ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెట్టాయని వ్యాఖ్యానించారు. అలాగే, కేంద్రం తీసుకురానున్న డీలిమిటేషన్ ప్రక్రియపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గేలా నిర్ణయాలు తీసుకుంటే బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. దేశ



అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# సుప్రీం తీర్పు ఎదురుదెబ్బ కాదు: కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్

- రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై మీనాక్షి నటరాజన్ పిటిషన్ కొట్టివేత
- ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- దేశంలో ప్రజాస్వామ్యానికి ఏం జరుగుతుందో ఈ ఘటనతో వెల్లడైందని వ్యాఖ్య

రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై సుప్రీంకోర్టులో చుక్కెదురైనప్పటికీ, ఇది తనకు ఎదురుదెబ్బ కాదని కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ఏం జరుగుతోందో ఈ ఘటనతో బహిర్గతమైందని ఆమె వ్యాఖ్యానించారు. రాజ్యాంగ సంస్థలపై గౌరవం ఉందని, అందుకే కోర్టు



తీర్పుపై నేరుగా స్పందించనని తెలిపారు. ఈ పరిణామం తనను షాక్‌కు గురిచేయలేదని మీనాక్షి నటరాజన్ అన్నారు. ఎన్నికల కమిషన్ పనితీరుపై తమకు నమ్మకం లేదని, అయితే తమ న్యాయపరమైన వాదనలో ఎలాంటి బలహీనత లేదని ఆమె పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు వేసిన తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎ.ఎస్. చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం కొట్టివేసింది. నామినేషన్ తిరస్కరణకు గురైన తర్వాత, ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని స్పష్టం చేసింది. దీనిపై ఎన్నికల సంఘంలో పిటిషన్ ద్వారానే పరిష్కారం వెతుక్కోవాలని సూచించింది. 2022లో తెలంగాణలో నమోదైన ఒక క్రిమినల్ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదని బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో జూన్ 9న రిటర్నింగ్ అధికారి ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. అయితే, రెండేళ్లకు పైగా శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల వివరాలు మాత్రమే వెల్లడించాల్సి ఉంటుందని, ఈ కేసులో కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయని ఆమె తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు.

# మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై జగ్గారెడ్డి ఆగ్రహం

- మీనాక్షిపై క్రిమినల్ కేసులు, న్యాయ వివాదాలు లేవన్న జగ్గారెడ్డి
- నామినేషన్ తిరస్కరణ అన్నది అన్యాయమైన, పిరికిపంద చర్య
- ఈసీని అడ్డుపెట్టుకుని బీజేపీ కుట్రలు చేస్తోందని మండిపాటు

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురవ్వడంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది బీజేపీ పక్కా ప్రణాళికతో చేసిన రాజకీయ కుట్ర అని ఆయన ఆరోపించారు. జాతీయ మీడియాతో మాట్లాడిన జగ్గారెడ్డి, మధ్యప్రదేశ్ లోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను పావుగా వాడుకుని, ఉద్దేశపూర్వకంగానే ఈ నామినేషన్‌ను అడ్డుకుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ పార్టీలోనే అత్యంత నిజాయతీ గల మహిళా నాయకురాలని జగ్గారెడ్డి కొనియాడారు. ఆమె రాజకీయ ప్రయాణం గురించి ఆయన ఈ కింది విషయాలను ప్రస్తావించారు. “ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు కాలేదు. కోర్టుల్లో ఎటువంటి న్యాయపరమైన వివాదాలు పెండింగ్‌లో లేవు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎప్పుడూ ధర్నాలు, రాస్తారోకోలు లేదా రాజకీయ వివాదాల్లో పాల్గొన్న దాఖలాలు లేవు. అటు వ్యక్తిగత జీవితంలోనూ, ఇటు బహిరంగ జీవితంలోనూ ఆమెది మచ్చలేని చరిత్ర. ఇంతటి క్లీన్ రికార్డ్ ఉన్న నాయకురాలి నామినేషన్‌ను తిరస్కరించడం అత్యంత దురదృష్టకరమని, ఇది అన్యాయమైన, పిరికిపంద చర్య” అని ఆయన అభివర్ణించారు. ఒక్క రాజ్యసభ సీటు కోసం బీజేపీ ఇంత దిగజారి రాజకీయాలు చేయాల్సిన అవసరం ఏముందని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్‌ను అడ్డం పెట్టుకుని బీజేపీ తన కుట్రను అమలు చేసిందని



ఆయన ధ్వజమెత్తారు. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి వ్యక్తుల ప్రమేయం ఉందని, ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడానికి రాజ్యాంగ వ్యవస్థలను ఆయుధాలుగా వాడుకుంటున్నారని ఆరోపించారు.

# మోదీ నాయకత్వంలో మన దేశం అద్భుతమైన గుర్తింపును పొందింది: డీకే అరుణ

- 2047 నాటికి వికసిత్ భారత్ గా మార్చడమే లక్ష్యమన్న అరుణ
- రైతులకు రూ. 24 వేల వరకు ఎరువుల సబ్సిడీని కేంద్రం అందిస్తోందని వెల్లడి
- ప్రపంచంలోనే భారత్ 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని వ్యాఖ్య

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుస్థిర నాయకత్వంలో భారతదేశం అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన గుర్తింపును సొంతం చేసుకుందని బీజేపీ ఎంపీ డీకే అరుణ కొనియాడారు. 2047 నాటికి దేశాన్ని ‘వికసిత్ భారత్’గా మార్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం బలమైన వ్యూహంతో ముందుకు సాగుతోందని ఆమె స్పష్టం చేశారు. మహిళా సాధికారత, అన్నదాతల సంక్షేమానికి



మోదీ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను అరుణ ప్రత్యేకంగా ప్రస్తావించారు. 2030 నాటికి దేశవ్యాప్తంగా 3 కోట్ల మంది మహిళలను ‘లఖ్‌పతి, క్రోర్‌పతి దీదీలు’గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు పడుతున్నాయని చెప్పారు. అలాగే వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ, రైతులకు ఎకరాకు రూ. 24 వేల వరకు ఎరువుల సబ్సిడీని అందిస్తోందని, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలు ప్రజల జీవితాల్లో ఎంతో భరోసానిచ్చాయని వివరించారు. మోదీ తీసుకున్న సాహసోపేతమైన, విప్లవాత్మక నిర్ణయాల వల్లే భారత్ నేడు ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని అరుణ మీడియాతో వ్యాఖ్యానించారు. దేశ భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఉగ్రవాదంపై కేంద్రం ఉక్కుపాదం మోపిందని చెప్పారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, జీఎస్టీ అమలుతో పాటు స్వచ్ఛ భారత్ అభియాన్, జన్ ధన్ యోజన వంటి మైలురాయి లాంటి కార్యక్రమాలు దేశ రూపురేఖలను సమూలంగా మార్చేశాయని, దేశ ప్రగతి-ప్రజల సంక్షేమమే రెండు కళ్లుగా సాగుతున్న ఈ పాలన రికార్డు స్థాయి విజయాలను నమోదు చేస్తోందని ఆమె కొనియాడారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై ఫైర్

## నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఖమ్మం బాలికకు హరీశ్ రావు పరామర్శ

తెలంగాణలోని ఖమ్మం పట్టణంలో 12 ఏళ్ల బాలికపై జరిగిన అమానుష దాడి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. బాలికపై లైంగిక దాడికి యత్నించి, ఆమెను ఒక అపార్ట్‌మెంట్ మూడో అంతస్తు నుంచి కిందకు తోసేసిన ఈ ఘటనపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ ప్రమాదంలో వెన్నెముక, పక్కటెముకలు,



చేతులకు తీవ్ర గాయాలైన బాధితురాలు ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వివరాల్లోకి వెళితే.. జూన్ 6న ఖమ్మంలోని రాపర్తి నగర్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. అదే అపార్ట్‌మెంట్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న మహమ్మద్ గౌస్, వాచ్‌మెన్ కుమార్తె అయిన సదరు బాలికను పైఅంతస్తులోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక ప్రతిఘటిస్తూ కేకలు వేయడంతో, నిందితుడు ఆమెను భవనం పైనుంచి కిందకు తోసేశాడు. మొదట ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా భావించిన కుటుంబ సభ్యులు, బాలిక స్పృహలోకి వచ్చిన తర్వాత అసలు విషయం చెప్పడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ ఘటనపై ఖమ్మం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, 24 గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆమె ఆహారం తీసుకుంటోందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ వెల్లడించారు. ప్రభుత్వంపై బీఆర్ఎస్ విమర్శలు గురువారం నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలికను బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు పరామర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ పాలనలో ప్రతిరోజూ 5 నుంచి 6 పోక్సో కేసులు నమోదవుతున్నాయని ఆయన ఆరోపించారు. బాధితురాలికి ప్రభుత్వం తక్షణమే రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, మెరుగైన వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. నిమ్స్‌లో మందులు ఉచితంగా లభించడం లేదని, పేద కుటుంబానికి చెందిన బాధితులు వాటిని బయట కొనాల్సి వస్తోందని ఆయన విమర్శించారు.

# ఇంటర్ పాసైన మాజీ మావోయిస్టు దేవ్‌జీ

## 42 ఏళ్ల తర్వాత ఇంటర్ పాసైన మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ



ఒకప్పుడు దండకారణ్యంలో తుపాకీ పట్టి దళాలకు నాయకత్వం వహించిన మావోయిస్టు మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, సుమారు 42 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తన ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేశారు. న్యాయవాది కావాలనే తన లక్ష్యం దిశగా ఆయన తొలి అడుగు వేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పోలీసుల ఎదుట లొంగిపోయిన ఆయన, మధ్యలో ఆగిపోయిన చదువును కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. వివరాల్లోకి వెళితే.. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన దేవ్‌జీ, 1980-82 మధ్య స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఎంపీసీ గ్రూపులో చేరారు. ఆ సమయంలో రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) ప్రభావంతో ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యారు. దీంతో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో అన్ని పరీక్షలు రాసినా, ఒక్క తెలుగు పరీక్ష మాత్రం రాయలేకపోయారు. రాసిన సబ్జెక్టులన్నిటిలోనూ పాసయ్యారు. అప్పట్లో పీపుల్స్‌వార్‌లో చేరి అజ్ఞాతంలోకి వెళ్లడంతో ఆయన చదువు అసంపూర్తిగా మిగిలిపోయింది. జనజీవన స్రవంతిలో కలిసిన తర్వాత తన చదువును పూర్తి చేయాలని భావించిన దేవ్‌జీకి తెలంగాణ ఇంటర్ బోర్డు అవకాశం కల్పించింది. ఇటీవల జరిగిన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఆయన మిగిలి వున్న తెలుగు పరీక్షకు హాజరయ్యారు. గురువారం విడుదలైన ఫలితాల్లో దేవ్‌జీ తెలుగులో 72 మార్కులు సాధించి ఉత్తీర్ణులయ్యారు. దీంతో ఆయన మొత్తం 614 మార్కులతో ఇంటర్ పూర్తి చేసినట్లయింది. న్యాయవాద వృత్తిపై ఆసక్తితో దేవ్‌జీ ఇటీవలే లాసెట్ పరీక్ష రాయగా, అందులో 349వ ర్యాంకు సాధించడం విశేషం. ఇప్పుడు ఇంటర్ కూడా పూర్తి కావడంతో ఐదేళ్ల లా కోర్సులో చేరేందుకు ఆయనకు మార్గం సుగమమైంది. ఎవరీ దేవ్‌జీ? సాధారణ సభ్యుడిగా మావోయిస్టు ఉద్యమంలో చేరిన దేవ్‌జీ, అంచెలంచెలుగా ఎదిగి పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడి స్థాయికి చేరుకున్నారు. 2003లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై తిరుపతి అలిపిరి వద్ద జరిగిన దాడి, 2010లో దంతెవాడలో 74 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను హతమార్చిన ఘటనల్లో దేవ్‌జీ కీలక సూత్రధారిగా ఉన్నారు. ఎన్ఐఏ మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న ఆయనపై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కలిపి రూ.కోటి రివార్డు కూడా ఉండేది. అలాంటి తీవ్రమైన గతం ఉన్న వ్యక్తి, ఇప్పుడు శాంతియుత మార్గంలో విద్య ద్వారా కొత్త జీవితాన్ని ప్రారంభించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# స్టార్మ్ వాటర్ డ్రైన్ (లైన్ ట్రంక్ లైన్) పరిశీలన

## పలు కాలనీలో జిహెచ్ఎంసి ఉన్నత అధికారులతో సుడిగాలి పర్యటన



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (ఉప్పల్), జూన్ 12 :** బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ జిహెచ్ఎంసి ఉన్నత అధికారులు ఎస్సీ హరి కిషోర్, డిఈ వెన్నెల గౌడ్, ఏఈ రాజ్ కుమార్లతో శుక్రవారం పలు కాలనీలలో కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. శ్రీనగర్ కాలనీ ధర్మపురి కాలనీ సాయిరాం నగర్ కాలనీలో మురుగనీటి కాలువ ట్రంక్ లైన్ కొరకు కాలనీలో పర్యటించి కాలనీ వాసులతో కలిసి ట్రంక్ లైన్ మార్గాన్ని ఇరిగేషన్ నాలాలోకి వెళ్లే విధంగా చర్చించి ఓ కొలిక్కి తీసుకువచ్చారు. ట్రంక్ లైన్ ఎక్కడ నుంచి ఎక్కడ వరకు వెళ్లాలి అన్న విషయానికై అధికారులు కాలనీ వాసులతో సమన్వయ పరుస్తూ నూతన ట్రంక్ లైన్ ఏర్పాటు చేసే విధంగా ఈ పర్యటన సాగిందని రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. ట్రంక్ లైన్ నిర్మాణంలో కాలనీ వాసుల సలహాలు సూచనల మేరకు కాలనీ వాసుల భాగస్వామ్యంతో కాలనీ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రంక్ లైన్ ఏర్పాటు చేస్తామని ఎస్సీ హరి కిషోర్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొక్కొండ జగన్, శ్యామ్, బంటి గౌడ్ శ్రీనివాస్, శ్రీనగర్ కాలనీ అధ్యక్షులు ఓంప్రకాష్, సాయిరాం నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు ధర్మపురి కాలనీ అసోసియేషన్ సభ్యులు మరియు కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పీపుల్స్‌డైరీ
కరీంనగర్
శనివారం, 13 జూన్ 2026
సంపుటి : 18, సంచిక : 101


# ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తోపాజి అనంత కిషన్ ప్రమాణ స్వీకారం



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్,12 :** ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంగారెడ్డికి చెందిన తోపాజి అనంత కిషన్ హైదరాబాద్లోని చంపాపేటలో ఉన్న సామ సరస్వతి గార్డెన్ శనివారం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. మాజీ మంత్రి టీజీ వెంకటేష్ సమక్షంలో తోపాజి అనంత కిషన్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంత కిషన్ మాట్లాడు తూ.. తనకు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ అభినందనలు తెలిపారు

# ఖమ్మం ఘటన నిందితుడికి కఠిన శిక్ష విధించాలి




**సిద్ధిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 12 :** ఖమ్మం జిల్లాలో 12 ఏళ్ల బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సిద్దిపేట విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో తెలంగాణ గోరక్షక్ దళ్ రాష్ట్ర సభ్యుడు గ్యాదరి రాజారాం మాట్లాడుతూ ఖమ్మం పట్టణంలో జరిగిన ఈ దారుణ ఘటన సమాజం తల దించుకునేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత బాలికకు న్యాయం జరిగేలా ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుని, నిందితుడికి చట్టప్రకారం అత్యంత కఠిన శిక్ష విధించాలని కోరారు. మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో ప్రభుత్వం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నేరస్థులపై వేగవంతమైన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా బజరంగ్ దళ్ సంయోజక్ బైరి మురళి, బోనాల శ్రీనివాస్, పొదిల శ్రీనివాస్, అజయ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్,12 :** సంగారెడ్డి జిల్లారాయికోడ్ మండలముప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాస్ నాయకత్వంలో ఉపాధ్యాయులు రాయికోడ్ గ్రామంలో ఇంటింటికి వెళ్లి డోర్టుడోర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్త కాలు, యూనిఫార్ములు, మధ్యాహ్న భోజన పథకం మరియు ఇతర సౌకర్యాల గురించి వివరించారు.అలాగే పాఠశాల వయస్సు గల ప్రతి చిన్నారిని తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని, విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమానికి మంచి స్పందన తెలియజేసి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తామఎని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాస్ తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు మరియు ఎమ్మార్సీ సిబ్బంది జి.మోహన్ ఎం. ఐ. ఎస్. కోఆర్డినేటర్,కాంప్లెక్స్ సిఆర్పి సి. హెచ్ రాజు, హస్తాబాద్ పాఠశాల ఉపాధ్యాయులు యం.శ్రీనివాస్, ఎల్గోయి ఉపాధ్యాయులు మల్లేశం, తాటిపల్లి ఉపాధ్యాయులు జనార్ధన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఇన్‌స్పెక్టం ఆధ్వర్యంల్లో ప్రత్యేక వాహన తనిఖీలు

**మద్యం సేవించి వాహనాలు నడిపిన 38 మందికి రూ.3.12 లక్షల జరిమానా**



**సిద్ధిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 12 :** సిద్ధిపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ ముత్యం రాజు ఆధ్వర్యంలో ఇటీవల సిద్ధిపేట పట్టణం, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 38 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. బ్రీత్ అనలైజర్ పరీక్షల్లో వారు మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో వారిని సిద్ధిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం 38 మందికి కలిపి రూ. 3,12,500 జరిమానా విధించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 22 మంది వ్యక్తులకు కోర్టు రూ. 1,05,500 జరిమానా విధించింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ముత్యం రాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ప్రతిరోజూ మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనదారులతో పాటు ఇతర రహదారి వినియోగదారుల ప్రాణాలకు కూడా ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారిపై కోర్టు కఠిన చర్యలు తీసుకుంటోందని, భారీ జరిమానాలు విధించడం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. అదేవిధంగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కూడా జరిమానాలు విధిస్తున్నామని తెలిపారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలి

- ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ
- అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి జ్యోతి



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 12 :** ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సెట్విన్ కార్యాలయంలో ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్‌ను సిద్దిపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి జ్యోతి, ఉమ్మడి మెదక్ జిల్లా మై భారత్ కార్యక్రమ అధికారి జి కిరణ్ కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ పోస్టర్‌ను సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ మరియు బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ రూపొందించారు. ఈ సందర్భంగా పి జ్యోతి మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. బాల కార్మికులను గుర్తించినట్లయితే టోల్ ఫ్రీ నంబర్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. అలాగే లేబర్ కార్డు ప్రాధాన్యతను వివరించారు. గజ్వేల్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎండి వికార్ మాట్లాడుతూ కార్మిక శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మై భారత్ కార్యక్రమ అధికారి జి కిరణ్ కుమార్ మాట్లాడుతూ బాల్యం ఎంతో విలువైనదని, ప్రతి చిన్నారి విద్యను పొందేలా తల్లిదండ్రులు కృషి చేయాలని అన్నారు. విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ బడి మానేసిన పిల్లలను తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. గత రెండు దశాబ్దాలుగా బాలల హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం లో సెట్విన్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, జిల్లా యువజన సంఘాల అధ్యక్షుడు అధికం రాజ్ గౌడ్, రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత దొమ్మాట రాజు, చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా ప్రతినిధి బాయికాడి లక్ష్మణ్, బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పిడిశెట్టి రాజు, సంకల్ప సంస్థ కోఆర్డినేటర్ బైరి చంద్రశేఖర్, సెట్విన్ సిబ్బంది తరుణ్ కుమార్, శిక్షణ పొందుతున్న విద్యార్థులు, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బట్ట సంచుల వినియోగంతో ప్లాస్టిక్ రహిత సమాజం సాధ్యం




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 12 :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక-99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో బట్ట సంచుల పంపిణీ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి జిల్లా నోడల్ అధికారి టి రవీందర్, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. కార్యక్రమంలో పట్టణంలోని వ్యాపారులు, దుకా ణదారులు, పంపిణీదారులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు కలిపి సుమారు 120 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా టి రవీందర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, వాటికి ప్రత్యామ్నాయంగా బట్ట సంచులు, నార సంచులు, చెక్క స్పూన్లు, స్టీల్ బాటిళ్లు, ఆకులతో తయారు చేసిన ప్లేట్లు వంటి పర్యావరణ హిత వస్తువులను ఉపయోగి ంచాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసిపో వడానికి వందల సంవత్సరాలు పడుతాయని, వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా అడ్డుకుంటాయని, వాటిని కాల్చడం వల్ల హానికర వాయువులు విడుదలై పర్యావరణం, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతా యని వివరించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇంటి వద్దే తడి చెత్త, పొడి చెత్త, హానికర వ్యర్థాలను వేర్వేరుగా వర్గీకరించి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. దీనివల్ల వ్యర్థాల నిర్వహణ సులభమై పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వ్యాపారులు, దుకాణదారులు ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని ఇప్పటికే గణనీయంగా తగ్గించామని, భవిష్యత్తులో కూడా పర్యావరణ హిత ప్రత్యామ్నాయ సంచులనే వినియోగిస్తామని తెలిపారు. అనంతరం పాల్గొన్న వారందరికీ బట్ట సంచులు పంపిణీ చేశారు. అలాగే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తూ ప్రజలకు బట్ట, నార సంచులను అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రజల సహకారం అవసరమని అధికారులు పిలుపునిచ్చారు.

# సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్2026 నిబంధనలను అమలు చేయాలి

- ప్లాస్టిక్ నిషేధం కోసం సమర్థవంతంగా కృషి చేయాలి
- ప్లాస్టిక్ రహిత సంగారెడ్డి కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలి
- మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్.



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 12 :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ 2026 నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయాలని సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ పిలుపునిచ్చారు. సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కలిసి ప్లాస్టిక్ నిషేధం, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్--2026 నిబంధనలపై శుక్రవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి అధికారిణి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణానికి తీవ్ర హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేసి, వాటికి బదులుగా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. అలాగే సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్--2026 నిబంధనల ప్రకారం తడి, పొడి, హానికర వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేసి, శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించడం ద్వారా పరిశుభ్రమైన పట్టణాల నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. సదస్సులో భాగంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వ్యాపార సంఘాల ప్రతినిధులకు బట్ట సంచులను పంపిణీ చేసి, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు ప్రత్యామ్నాయంగా వాటి వినియోగాన్ని ప్రోత్సహించారు. ప్లాస్టిక్ రహిత సంగారెడ్డి నిర్మాణానికి వ్యాపారవేత్తలు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషి చేయాలని అధికారులు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కిరాణా దుకాణాల సంఘం ప్రతినిధులు, బేకరీ షాప్ అసోసియేషన్ సభ్యులు, వ్యాపారవేత్తలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమంగా చేపలు పడుతూ పట్టణాలకు తరలించడంపై ప్రజల మండిపాటు

- చెరువులపై పెత్తనం..రాత్రిపూట అక్రమంగా చేపలు పడుతూ పట్టణాలకు తరలించడంపై ప్రజల మండిపాటు
- పిడిసిల్ల గ్రామంలో ధర్నా చేపట్టిన ప్రజలు
- ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సర్పంచ్ నైనకంటి మమత-ప్రభాకర్ రెడ్డి



**ఉమ్మడి వరంగల్ జూన్ 12 :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పిడిసిల్ల, ఎల్లారెడ్డిపల్లి గ్రామాలలో ఉన్న చెరువులపై ఒక వ్యక్తి గత కొన్నేళ్లుగా పెత్తనం చెలాయిస్తూ..అందులోని చేపలను రాత్రిపూట అక్రమంగా పడుతూ..పట్టణ ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆ వ్యక్తిపై మండిపడుతున్నారు. పిడిసిల్ల, ఎల్లారెడ్డి పల్లి గ్రామాల పరిధిలో ఉన్న చెరువులలో ప్రభుత్వం వేస్తున్న చేప పిల్లలను ఆయా గ్రామాలలో ఉన్నటువంటి మత్స్యకారులు అట్టి చేపలను పట్టి ఉపాధిని మెరుగుపరచుకోవాల్సి ఉంది. కానీ ఆయా గ్రామాలలో మత్స్యకారులు లేనందున చెరువులలో వేస్తున్న చేప పిల్లలు పెద్దవగానే, ఆయా గ్రామాల సర్పంచ్ లు టెండర్ ద్వారా వేరే గ్రామాలకు చెందిన మత్స్యకారులకు అప్పగించాల్సి ఉంటుంది. టెండర్ ద్వారా వచ్చిన అట్టి డబ్బులను గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం పనిచేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా ఒక వ్యక్తి మాజీ మండలా లీడర్ తన ఇష్టారాజ్యంగా చెరువులపై పెత్తనం చెలాయిస్తూ..అందులోని చేప పిల్లలను పడుతూ..పట్టణ ప్రాంతాలకు తరలించి.. లక్షలాది రూపాయల ప్రజల సొమ్మును కాజేస్తున్నాడని ఆరోపిస్తూ ఆయా గ్రామాల ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తూ.. రోడ్డుపై బైఠాయించి ధర్నా కార్యక్ర మాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి.. ధర్నాలో పాల్గొన్న పిడిసిల్ల గ్రామ సర్పంచ్ నైనకంటి మమత-ప్రభాకర్ రెడ్డి దంపతులు మాట్లాడారు. ఒక ప్రైవేట్ వ్యక్తి ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరిస్తూ..రెండు గ్రామ పంచా యతీల పరిధిలో గల చెరువులలో అక్రమంగా చేపలు పడుతూ..ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నాడని ఆరోపించారు. వెంటనే సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ఆ చెరువులలో లభించే చేపలను గ్రామ పంచాయతీల హక్కుగా పరిగణించి.. టెండర్లను చేపట్టి, చేపలను పట్టి, వాటిని అమ్ముకునేందుకు గ్రామపం చాయతీలకు అధికారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, వార్డు మెంబర్లు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరుద్యోగ మైనారిటీ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా నైపుణ్య శిక్షణలు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 12 :** తెలంగాణ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ మైనారిటీల ఆర్థిక సంస్థ, తెలంగాణ క్రైస్తవ మైనారిటీల ఆర్థిక సంస్థల ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరంలో నిరుద్యోగ మైనారిటీ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి నాగరాజమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాల అమలుకు ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలతో అనుబంధం కలిగి, శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడంలో అనుభవం ఉన్న శిక్షణ భాగస్వామ్య సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల సంస్థలు తమ ప్రతిపాదనలను జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి కార్యాలయం, సిద్దిపేటకు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు



# ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యం

## పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నాం : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి





**ఆత్మకూర్, జూన్ 12 (పీపుల్స్ డైరీ) :** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణ యందు ఆత్మకూర్, గుడేప్పాడ్, అక్కంపేట, కటాక్షపూర్, కొత్త గట్టు, మల్కపేట, అగ్రం పహాడ్, నీరుకుల్లా, పెంచికలపేట, చౌలపల్లి, లింగమడుగు పల్లి, నాగయ్య పల్లి గ్రామాలకు చెందిన సీసీ రోడ్డు, సైడ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే పెద్దాపురం గ్రామానికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ కి కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నాం అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పిస్తూనే, మరోవైపు ఆర్టీసీ సంస్థకు సైతం మంచి ఆర్థిక బలాన్ని చేకూరుస్తోంది అని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకుల చేతుల్లో గ్రామాల్లో అభివృద్ధి నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురైన గ్రామాలు నేడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకురావడం తోపాటు గ్రామాలలో మౌలిక వసతులను అభివృద్ధి పరచడం కోసం, అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలందరి సహకారంతో నియోజకవర్గంలోని గ్రామాలు మరింత అభివృద్ధి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. గ్రామాల్లోని సి సి రోడ్లు, సైడ్ డ్రైనేజ్ పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అలాగే కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇటీవల పెద్దాపూర్ గ్రామానికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ కి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి చర్యలు శంకుస్థాపన చేశారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్) పేరిట ప్రత్యేక మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందన్నారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు డైట్ చార్జెస్ పెంచామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, జిల్లా, మండల నాయకులు, శాఖల అధికారులు పాల్గొన్నారు.




## విద్యాసంస్థలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి!

### ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్

**మట్టెవాడ, జూన్ 12 (పీపుల్స్ డైరీ):** ఈ నెల 15న నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న తరుణంలో ప్రభుత్వ విద్యా సంస్థలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏ.ఐ.ఎస్.బి) రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో నవీద్ మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ఈనెల 15 నుండి విద్యాసంస్థలు పునః ప్రారంభం అవుతున్న సందర్భంలో ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని ప్రధానంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, డ్రెస్ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అందలేదు, రాష్ట్రంలో అనేక పాఠశాలల్లో సరయిన మౌలిక వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సరియైన గదులు, మరుగుదొడ్లు లేక ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో సరియైన వసతులు కల్పించి ప్రభుత్వ సంస్థలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధంగా చొరవ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, శ్రవణ్, మిస్బా, రాజు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి ఉపకారవేతనంకు ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థిని



**కేసముద్రం, జూన్ 12 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కేసముద్రానికి చెందిన విద్యార్థిని జి. వెన్నెల ప్రతిష్టాత్మకమైన ప్రగతి ఉపకార వేతనం 2025కు ఎంపికైనట్లు కళాశాల ప్రధానాచార్యుడు ఈ. మల్లికార్జున్ తెలిపారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ఆధ్వర్యంలో బాలికల ఉన్నత సాంకేతిక విద్యను ప్రోత్సహించేందుకు అందజేసే ఈ ఉపకారవేతనం ద్వారా జి. వెన్నెలకు ప్రతి విద్యా సంవత్సరానికి 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందనుంది. ఈ ఆర్థిక సహాయం ప్రస్తుత విద్యా సంవత్సరంతో పాటు రెండవ, మూడవ సంవత్సరాలలో కూడా కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానాచార్యుడు ఈ. మల్లికార్జున్ మాట్లాడుతూ జి. వెన్నెల సాధించిన ఈ విజయం కళాశాలకు గర్వకారణమని, ఇతర విద్యార్థినులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకుంటూ ఇటువంటి జాతీయ స్థాయి ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రధాన సంధాన అధికారి బి. సత్యనారాయణ మాట్లాడుతూ, మండలి అందిస్తున్న వివిధ ఉపకారవేతన పథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా మరింత మంది లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జి. వెన్నెల ఎంపికకు సహకరించిన అధ్యాపక బృందానికి ఆయన అభినందనలు తెలియజేశారు. జి.వెన్నెల ఈ ప్రతిష్టాత్మక ఉపకారవేతనానికి ఎంపిక కావడంతో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, సహ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## పేద హిందూ జంటలకు "కళ్యాణమస్తు" పేరిట ఉచిత వివాహాలు

### 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోండి - త్రిపురనేని గోపీచంద్



**మట్టెవాడ, జూన్ 12 (పీపుల్స్ డైరీ):** ఈనెల 24న బుధవారం వరంగల్ ములుగు రోడ్డులోని అయ్యప్ప గుడి ప్రక్కన గల సప్తధామ్‌లో 18 మంది పేద హిందూ జంటలకు 'కళ్యాణమస్తు' పేరిట ఉచిత సమిష్టి వివాహాలు జరప సంకల్పించినట్లు శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద చేతుల మీదుగా "కళ్యాణమస్తు" కార్యక్రమ గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం గోపీచంద్ మాట్లాడుతూ తమ ట్రస్టు ఆధ్వర్యంలో 18 పేద జంటలకు హిందూ సాంప్రదాయ పద్ధతిలో వివాహం చేయడంతో పాటు వధువుకు ఉచితంగా బంగారు మంగళ సూత్రాలు, వెండి మట్టెలు, వధూవరులకు పెళ్లి బట్టలు, పూజా సామాను యావత్తు, భోజన ఖర్చులు అన్ని ట్రస్టు భరించి కళ్యాణాలు ఉచితంగా జరిపిస్తుందని త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. సద్గురువు శ్రీ శివానందుల వారు, వారి నాయనమ్మ , అమ్మ , వారి సతీమణి గంగాదేవి వందల మందికి పట్టు వస్త్రాలు, మంగళ సూత్రాలు, మట్టెలు ఇచ్చి పెళ్లి ఖర్చులు ఇచ్చి అనేక పెళ్లిళ్లు జరిపించారని గోపీచంద్ వివరించారు. కళ్యాణ తంతు పూర్తయిన అనంతరం 18 మంది నూతన జంటల చేత శ్రీ రమా సత్యనారాయణ స్వామి వ్రతాలు కూడా ట్రస్టు ఆధ్వర్యంలో నియమ నిష్ఠలతో చేయించడం జరుగుతుందన్నారు. ఈ పుణ్య ముహూర్తంలో వివాహం చేసుకొని దంపతులు కావాలనుకునే నిరుపేద జంటలు ఈ నెల 20వ తేదీ లోగా ఫోటో, ఆధార్ కార్డు, కులం, ఇతర ధృవీకరణ పత్రాలతో సప్తధామ్ కార్యాలయంలో స్వయంగా హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 9848423133, 9849821999 నెంబర్లలో సంప్రదించాలని గోపీచంద్ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీలు బండారు సాయినారాయణ, జి. ఉమాశంకర్, మాదారపు సదాశివుడు, డాక్టర్ రవీందర్ వెంకటరమణ పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన మనందరి బాధ్యత




**మట్టెవాడ, జూన్ 12 (పీపుల్స్ డైరీ):** ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా డాన్ బాస్కో నవజీవన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ నుండి ప్రారంభమై శివనగర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి ప్రతి చిన్నారికి విద్యా హక్కును కల్పించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. బాలల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితారెడ్డి పిలుపునిచ్చారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన మనందరి బాధ్యత అని బాల కార్మిక వ్యవస్థను అంతం చేద్దాం, బాలలందరినీ బడికి పంపుదాం, బాలలందరినీ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుదాం, బాల కార్మికులు లేని సమాజం మన ధ్యేయం కావాలని చిన్నారుల చేతులకు పనిముట్లు కాకుండా పుస్తకాలు అందించి వారి హక్కులను కాపాడుదాం అని డాక్టర్ అనితారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంతెజార్ గంజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షకూర్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ రమేష్, సామాజిక కార్యకర్త మండల పరశురాములు, డాన్ బాస్కో కోఆర్డినేటర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## 19న ఉచిత నేత్ర వైద్య శిబిరం పోస్టర్ల ఆవిష్కరణ



**మట్టెవాడ, జూన్ 12 (పీపుల్స్ డైరీ):** ఈ నెల 19న బిజెపి రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు జన్మదినం సందర్భంగా హైదరాబాద్ శంకర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో కాశిబుగ్గ కెవిఎస్ ఫంక్షన్ హాలులో నిర్వహించే ఉచిత నేత్ర వైద్య శిబిరం పోస్టర్లను ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినీత్ రావు మాట్లాడుతూ సమాజంలోని పేద, నిరుపేద ప్రజలకు కంటి సమస్యల వలన కంటి పొర, రెటీనా సమస్యలు ఉన్నవారికి ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కంటి ఇబ్బందుల బారిన పడకుండా అందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మార్టిన్ లూథర్, సీనియర్ నాయకులు కర్నే రవీందర్, కోమాకుల నాగరాజు, బోరిగం నాగరాజు, ఆకుతోట రాజు, బల్కూరి రాజు, ప్రభాకర్, శ్రీకాంత్, శ్రీనివాస్, వెంకటేష్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఈనెలాఖరులోపు ఈకేవైసీ చేసుకోవాలి : తాసిల్దార్ వసంతరావు



**చిట్యాల, జూన్ 12 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని అన్ని గ్రామాల గ్యాస్ వినియోగదారులు ఎల్పిజి సేవలు నిరంతరాయంగా పొందాలంటే 30 జూన్ 2026లోపు బయోమెట్రిక్ ఆధార్ ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని మండల తాసిల్దార్ వసంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవేళ చేసుకొని వినియోగదారులు ఈకేవైసీ ప్రక్రియను గ్యాస్ కంపెనీ కి సంబంధించిన యాప్స్ ద్వారా గాని గ్యాస్ డెలివరీ సిబ్బంది సహాయంతో లేదా సమీప గ్యాస్ కార్యాలయలయం నందు చేసుకోవాలన్నారు. గడువులోపు ఈకేవైసీ పూర్తి చేయని వినియోగదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఎల్పిజి సబ్సిడీలను కానీ గ్యాస్ సిలిండర్లు కానీ పొందలేరన్నా రు. తెలిపారు. ఈకేవైసీ చేయించుకోని వినియోగదారులు వెంటనే ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

### సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్



**నర్సింహులపేట, జూన్ 12 (పీపుల్స్ డైరీ):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాసు పిలుపునిచ్చారు. ఉమ్మడి నర్సింహులపేట మండల సీపీఎం కమిటీ సమావేశం మండల కేంద్రంలో మందుల యాకూబ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సాదుల శ్రీనివాసు మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడుతోందని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని విమర్శించారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం చేకూర్చే విధానాలను అమలు చేస్తూ సామాన్యులను నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వాగ్దానాలకే పరిమితమైందని, రైతుబంధు, రుణమాఫీ, వడ్ల కొనుగోలు బకాయిల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. సాగు సీజన్ ప్రారంభమైనప్పటికీ ఎరువులు, యూరియా, డీఏపీ సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, ఆరోగ్య శిబిరాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు, మండల కన్వీనర్ గునిగంటి మోహన్, మందుల యాకూబ్, బానోతు సర్వన్, కూరంది సురేష్, కందుకూరి సుధాకర్, జక్కుల లింగయ్య, దయ్యాల మల్లయ్య, లక్ష్మయ్య, వీరభద్రం, ఉస్మాన్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## రహదారి వెడల్పు పనుల్లో కాలువ ధ్వంసం

### మురుగు వాసనతో ప్రజల అవస్థలు

**కేసముద్రం, జూన్ 12 (పీపుల్స్ డైరీ) :** కేసముద్రం పురపాలక పరిధిలో ప్రధాన రహదారిపై మధ్య వెలుగుల ఏర్పాటు కోసం రహదారి వెడల్పు పనులు చేపట్టడంతో మురుగు కాలువ పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఇళ్ల ముందు, దుకాణాల ఎదుట మురుగు నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి వెడల్పు పనుల్లో భాగంగా పాత కాలువను తొలగించి కొత్త కాలువ నిర్మించకుండా వదిలేయడంతో మురుగు నీరు రహదారిపై పారుతోందని స్థానికులు వాపోతున్నారు. దుర్వాసనతో ఊపిరి పీల్చలేకపోతున్నామని, దోమల బెడదతో అంటు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుకాణదారులు మాట్లాడుతూ, మురుగు నీరు నిలిచిపోవడంతో వినియోగదారులు రావడం లేదని, వ్యాపారాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. రహదారి వెడల్పు పనులు పూర్తి చేసిన వెంటనే మురుగు కాలువను కూడా నిర్మించాల్సి ఉండగా, అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారని ఆరోపించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున వెంటనే కాలువ నిర్మాణం చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని పురపాలక అధికారులను స్థానికులు కోరుతున్నారు.



# అంగన్వాడి భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి



**ఆత్మకూర్, జూన్ 12 (పీపుల్స్ డైరీ) :** ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్మించిన అంగన్వాడి భవనాన్ని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్న ప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది అంగన్వాడీలని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, బాలల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ప్రీ ప్రైమరీ స్కూల్ లు ఏర్పాటు చేయబోతున్నామని, డైట్ చార్జెస్ పెంపు, అత్యాధునిక విద్యా ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంగన్వాడి కేంద్రాలు చిన్నారుల విద్యాభివృద్ధికి, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో కీలకమని తెలిపారు. పిల్లలకు పోషకాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సేవలు అందించే దిశగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు రేవూరి రణధీర్ రెడ్డి, కమలాపురం రమేష్, కక్కెర్ల రాజు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు, గ్రామ పార్టీ అధ్యక్షుడు భయ్యా కుమారస్వామి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# అధర్మంపై ధర్మయుద్ధం చేస్తున్న పీపుల్స్ డైరీ



**చిట్యాల, జూన్ 12 (పీపుల్స్ డైరీ) :** సమాజంలో పేరుకుపోయిన అన్యాయం అవినీతి అక్రమాలు అధర్మంపై ధర్మ యుద్ధం చేస్తున్న పత్రిక పీపుల్స్ డైరీ పత్రిక అని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దొడ్డే శంకర్ మాదిగ అన్నారు. అనతి కాలంలోనే అంచలంచెలుగా ఎదుగుతూ పీపుల్స్ డైరీ తెలుగు దినపత్రికలోని ప్రతి అక్షరం ప్రజల పక్షమే అని ప్రజల సమస్యల పరిష్కారమే ఏజెండా గా పనిచేస్తున్న దమ్ము ధైర్యం ఉన్న పత్రిక పీపుల్స్ డైరీ మాత్రమే అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ సమాజంలోని సమాజ ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే దశలో ప్రజా ప్రతినిధుల ద్వారా అధికార యంత్రాం గం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితులకు అండగా నిలుస్తున్న పీపుల్స్ డైరీ పత్రిక ప్రజాస్వామ్యాన్ని కాపాడే నిజమైన తెలుగు దినపత్రిక అన్నారు. మహనీయుల ఆశయాలను వారి కలలను సాకారం చేసే విధంగా పీపుల్స్ డైరీ తెలుగు దినపత్రిక పేదల అణగారిన వర్గాలకు అండగా నిలుస్తూ వారి పక్షాన నిటా రుగా నిలబడి అక్షరాలతో పోరాటం చేస్తున్న ప్రజా అక్షర యుద్ధ నౌక పీపుల్స్ డైరీ పత్రిక అన్నారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందే విధంగా పీపుల్స్ డైరీ పత్రిక ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

# పీపుల్స్ డైరీపై దావా వేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం



**చిట్యాల, జూన్ 12(పీపుల్స్ డైరీ) :** ప్రజల సమస్యలను వెలికితీస్తూ వారికి అండగా నిలుస్తూ ప్రజల పక్షాన వారికి న్యాయం చేయడం కోసం అక్షరాలతో పోరాడుతున్న దమ్మున్న పత్రిక పీపుల్స్ డైరీ తెలుగు దినపత్రిక పై పరువు నష్టం దావా వేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతూ ప్రజలకు తాను చేసిన అన్యాయంపై ప్రశ్నించినందుకు ప్రజలకు అండగా నిలిచినందుకు ఆర్టిఐ మాజీ కమిషనర్ శంకర్ నాయక్ పీపుల్స్ డైరీ పత్రికపై పరువు నష్టం దావా వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మని అన్నారు. అనతి కాలంలోనే అనేకమైన సంచలన వార్తలు రాస్తూ ప్రజలకు పీడితులకు అణగారిన వర్గాలకు అండగా నిలుస్తూ ప్రజాస్వామ్య యుతంగా అక్షర యుద్ధం చేస్తున్న పీపుల్స్ డైరీ పత్రికపై భయభ్రాంతులకు గురి చేసే విధంగా పరువు నష్టం దావా వేయడం సరైనది కాదు అన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియాకు స్వేచ్ఛ ఉంటుందని వారి స్వేచ్ఛను హరించే విధంగా వ్యవహరించే వ్యక్తులపై సంస్థలపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. అన్యాయాలను ఎదిరిస్తూ అండగా నిలుస్తున్న పీపుల్స్ డైరీ పత్రికకు తాము అండగా ఉంటామని అవసరమైతే పోరాటాలు చేస్తామని ఆయన తెలిపారు.

## ఈ-తరగతులు చరవాణి అనువర్తనం ఆవిష్కరణ



**మహబూబాబాద్, జూన్ 12 (పీపుల్స్ డైరీ) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ఇతర ఉద్యోగాల కోసం వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉపయోగపడే విధంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి రూపొందించిన రాకేష్ రెడ్డి ఈ-తరగతులు చరవాణి అనువర్తనాన్ని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో విద్యార్థులు, నిరుద్యోగుల సమక్షంలో మాజీ శాసనసభ్యుడు బానోత్ శంకర్ నాయక్ ఆవిష్కరించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, శాసనమండలి సభ్యుడు రవీందర్ రావు, మాజీ పార్లమెంటు సభ్యురాలు కవిత, మాజీ జిల్లా పరిషత్ పాలక మండలి అధ్యక్షురాలు అంగోత్ బిందు, మాజీ పురపాలక పాలక మండలి అధ్యక్షుడు రాం మోహన్ రెడ్డి, పురపాలక సభ్యురాలు బానోత్ తేజస్వి, రావుల రవిచందర్ రెడ్డి, ముత్యం వెంకన్న గౌడ్, నాయిని రంజిత్, పురపాలక సభ్యులు నరేష్, రజిత, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడిన నాయకులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, నిరుద్యోగులకు ఈ చరవాణి అనువర్తనం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఉచితంగా అందుబాటులో ఉండే ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# ఎంపీడీఓ కార్యాలయంలో ఏసీబీ దాడులు

## రూ.45 వేలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

**నర్సింహులపేట, జూన్ 12 (పీపుల్స్ డైరీ) :** మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన దాడిలో ఎంపీడీవో, ఎంపీఓ, ఎంపీడీవో కుమారుడు పట్టుబడ్డారు. వెంచర్ అనుమతి మంజూరు కోసం లంచం డిమాండ్ చేసి, మిగిలిన రూ.45 వేల నగదు స్వీకరిస్తుండగా వారిని రెడ్‌హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి మండలంలోని పడమటిగూడెం గ్రామ శివారులో నాలుగు ఎకరాల భూమిని కొనుగోలు చేసి వెంచర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాడు. భూమికి సంబంధించి వివాదం తలెత్తడంతో విషయం హైకోర్టు వరకు వెళ్లింది. ఈ క్రమంలో సంబంధిత వ్యవహారంపై



ఎంపీడీవో రాధిక, ఎంపీఓ కిన్నెర యాకయ్యలకు నోటీసులు అందాయి. వెంచర్ అనుమతి మంజూరు చేయాలంటే రూ.1 లక్ష లంచం ఇవ్వాలని అధికారులు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే కొంత మొత్తం చెల్లించగా, మిగిలిన రూ.45 వేల కోసం ఒత్తిడి తెచ్చినట్లు బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు ఉచ్చుపన్ని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో దాడి నిర్వహించారు. ఎంపీడీవో రాధిక, ఎంపీఓ కిన్నెర యాకయ్యలు నగదు స్వీకరిస్తుం డగా పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించినట్లు గుర్తించిన ఎంపీడీవో కుమారుడు నాగరాజును కూడా అదుపులోకి తీసుకున్నారు. నిందితులను శనివారం వరంగల్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచ నున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఎస్సైలు ఎల్ రాజు, డి రాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచుల ఫోరం మండల కమిటీ ఎన్నిక



**నర్సింహులపేట, జూన్ 12 (పీపుల్స్ డైరీ):** రాష్ట్ర ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు బొట్ల కార్తీక్ సూచనల మేరకు, మహబూబాబాద్ జిల్లా ఉపసర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కొయ్యాల అనిల్ అధ్యక్షతన మండల కేంద్రంలో ఉపసర్పంచుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చుక్క వేణు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బానోతు యాకుబ్, ఉపాధ్యక్షులుగా దొంతు మహేష్, జోగి ఉమేష్, ప్రధాన కార్యదర్శిగా అజ్మీర రవి, కోశాధికారిగా చెమ్ముల నవీన్ రెడ్డి, అధికార ప్రతినిధిగా గుగులోత్ కిషన్, కార్యదర్శులుగా బద్రు, జాటోతు లాలు, మాలోతు సురేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు జిల్లా నాయకులు అభినందనలు తెలిపారు. ఉపసర్పంచుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, గ్రామాభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దీకొండ సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు కాస యాకయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఉద్యోగులు



**గణపురం, జున్ 12 (పీపుల్స్ డైరీ) :** వైటీపీఎస్‌లో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ), యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఏహెచ్‌పీ) నిర్వహణను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించేందుకు జెన్కో యాజమాన్యం టెండర్లు పిలవడాన్ని ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరే కించారు. ఇప్పటికే సంస్థలో అవసరమైన స్థాయిలో ఉద్యోగులు ఉండగా, కీలక విభాగాలను ప్రైవేటీకరిం చాలనే నిర్ణయం సమంజసం కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కేటీపీపీ ప్రాంగణంలో ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యుత్ ఉత్పత్తిలో కీలకమైన కోల్ హ్యాండ్లింగ్, యాష్ హ్యాండ్లింగ్ విభాగాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వల్ల ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జెన్కో ఆధ్వర్యంలో ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులతోనే ఈ విభాగాల నిర్వహణ కొనసాగించాలని యాజమాన్యాన్ని కోరారు. ప్రైవేటీకరణ చర్యలను వెంటనే విరమించుకోవాలని, లేదంటే జేఏసీ ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటీకరణ నిర్ణయాలు ఉద్యోగుల్లో ఆందోళనకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. యాజమాన్యం ఉద్యోగుల అభిప్రాయాలను గౌరవించి టెండర్ల ప్రక్రియను పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేటీపీపీ ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ భూ రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా మంద సాంబయ్య



**మొగుళ్లపల్లి, జూన్ 12 (పీపుల్స్ డైరీ) :** మండలం లోని పెద్ద కోమటిపల్లి గ్రామానికి చెందిన మంద సాంబయ్య తెలంగాణ భూ రక్షణ సమితి అధ్యక్షునిగా నియమితులయ్యారు. పెద్ద కమిటీ గ్రామానికి అరుదైన గౌరవం దక్కిందని గ్రామస్తులు సంబరాలు జరుపుకున్నారు. పోరాట పటిమ కలిగిన మంద సాంబయ్య భారతీయ జనతా పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించి, మొగుళ్ళపల్లి మండలంలో పార్టీని బలోపితం చేసి, అధికార పార్టీకి ధీటుగా భారతీయ జనతా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి, బీజేపీలో నూతన ఉత్తేజం తెచ్చి. ఎంతోమంది యువకులు ప్రజా ప్రతినిధులుగా గెలుపొందడంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించి. తెలంగాణ బీజేపీలో మొగుళ్లపల్లి మండలాన్ని ముందుంచడంలో ఆయన విశేష కృషి చేశాడు. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో. తెలంగాణ ప్రజలంతా స్వరాష్ట్ర ఆకాంక్ష మేరకు ఉద్యమిస్తుంటే..ప్రజల కోరిక మేరకు ఉద్యమ పార్టీని ఎంచుకొని. కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్ లో చేరి. బంగారు తెలంగాణ దిశగా నాటి ప్రజా ప్రతినిధులతో కలిసి ముందడుగు వేశారు. ఈ క్రమంలో ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న బీఆర్ఎస్ పార్టీని వీడి ప్రజా పాలన-ప్రగతి నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరి. భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు గెలుపులో క్రియాశీలక పాత్ర పోషించాడు. వివిధ రాజకీయ పార్టీలతో, నాయకులతో, ప్రజా ప్రతినిధులతో తస్సంబంధాలు కలిగిన నేతగా మంచి గుర్తింపు ఉన్న మంద సాంబయ్య అసైన్డ్ భూమి కలిగిన రైతులకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు కృషి చేస్తాడని భావించిన తెలంగాణ భూ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య ఈ మేరకు నియామక ఉత్తర్వులను జారీ చేశాడు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన మంద సాంబయ్య మాట్లాడుతూ. తనపై నమ్మకంతో ఈ బృహత్తరమైన బాధ్యతలను అప్పగించిన తెలంగాణ భూ రక్షణ సమితి రాష్ట్ర నాయకుల సూచనల మేరకు అసైన్ భూమి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీనిచ్చారు.

## హరీష్‌రావుకు స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు




**గణపురం, జున్ 12 (పీపుల్స్ డైరీ) :** భూపాలపల్లి జిల్లాలో నిర్వహించిన సింగరేణి పరిరక్షణ సదస్సుకు హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావుకు గణపురం మండల బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం మొరాచపల్లి గ్రామంలో హరీష్ రావు రాక సందర్భంగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీష్ రావుకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తోందని, సంస్థ ప్రయోజనాలను కాపాడేందుకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. హరీష్ రావుకు స్వాగతం పలికిన వారిలో గణపురం మండలానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైక్లింగ్ పోటీల గోడ పత్రికలు ఆవిష్కరించిన మంత్రి సీతక్క



**ములుగు, జూన్ 12 (పీపుల్స్ డైరీ) :** ఈ నెల 14న ములుగు జిల్లా కేంద్రంలో అస్మిత ఖేలో ఇండియా బాలికల సిటీ సైక్లింగ్ పోటీల గోడ పత్రికలను శుక్రవారం మంత్రి సీతక్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ మంత్రి సీతక్క తోపాటు కలెక్టర్ హేమంత్ సహదేవరావు బొర్కడే, డిఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్ రెవెన్యూ మహేందర్ జీ, లోకల్ బాడీ అదనపు కలెక్టర్ సంపద రావు, జిల్లా పంచా యతీ అధికారి వెంకయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, కిసాన్ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, కోచ్ శ్రీరామ్‌ను కలిసి పోటీలకు హాజరు కావా లని కోరుతూ ఆయన వారికి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం లో మంత్రి సీతక్క మాట్లాడారు. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతా యని ఆమె తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు తమ సొంత సైకిల్‌తో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ లు తెచ్చుకోవాలని అన్నారు. ఆసక్తి కలవారు ఈ నెల 12 తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. పూర్తి వివరాలకు సైక్లింగ్ కోచ్ శ్రీరామ్ నంబర్ 8886817492 సంప్రదించాలని ఆమె కోరారు.

## ఎమ్మెల్యే వివాహ వార్షికోత్సవ వేడుకలు



**మహబూబాబాద్, జూన్ 12 (పీపుల్స్ డైరీ) :** మహబూబాబాద్ శాసనసభ్యుడు వైద్యుడు మురళీ నాయక్, మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైద్యురాలు భూక్య ఉమ మురళీ నాయక్ దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీరామగిరి గ్రామ సర్పంచ్ మాదరి ప్రశాంత్ శుభాకాంక్షలు తెలిపారు. దాంపత్య జీవితం ఎల్లప్పుడూ ఆనందం, ప్రేమ, సంతోషాలతో నిండిపోవాలని, ఇలాంటి వివాహ వార్షికోత్సవ వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధిస్తూ సుఖసంతోషాలతో జీవించాలని సర్పంచ్ మాదిరి ప్రశాంత్ పేర్కొన్నారు.

# చెరువు మాదే.. చేపలు మావే..!

**రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు.**

**15 రోజుల ముందు గ్రామ పంచాయతీ తీర్మానం**

**సామరస్యంగా సమస్య పరిష్కరించుకోవాలి : ఎస్సై**

**మొగుళ్లపల్లి, జూన్ 12 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని పిడిసిల్ల ఎల్లారెడ్డిపల్లి రెండు గ్రామాల మధ్యలో ఉన్నటువంటి గ్రామ ఊర చెరువు మాదే అందులోని చేపలు మావే అంటూ పిడిసిల్ల, ఎల్లారెడ్డి పల్లె రెండు గ్రామాలకు చెందిన ప్రజలు రోడ్డుపై బైఠాయించడంతో జమ్మికుంట, మొగుళ్లపల్లి ప్రధాన రహదారి కావడం తో విడిసిల్ల గ్రామంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మొగుళ్ళపల్లి మండలంలోని పిడిసిల్ల, ఎల్లారెడ్డిపల్లె గ్రామాల ఊర చెరువు లోనీ చేపలు మా గ్రామ ప్రజలకు ఇవ్వకుండా పొరుగు గ్రామానికి చెందిన ఒక ముదిరాజు. రెండు గ్రామాల ప్రజలను సైతం లెక్కచేయకుండా. చెరువులోని చేపలను పడుతూ. సొమ్ము చేసుకుంటున్నాడని, పిడిసిల్ల గ్రామంలో ఒకే ముదిరాజు కుటుంబం ఉండడంతో ఇదే అదునుగా భావించి, పిడిసిల్ల ఎల్లారెడ్డి పల్లె గ్రామ ప్రజలను లెక్కచేయకుండా చేపలు పడుతున్నాడని. గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత మండల స్థాయి అధికారులకు గత 15 రోజుల క్రితం గ్రామపంచాయతీ తీర్మానం చేసినప్పటికీ ముదిరాజు కులస్తుడు గ్రామస్తుల మాటలు తీర్మానాన్ని చెవిన పెట్టకుండా.



పిడిసిల్ల, ఊర చెరువులో రాత్రికి రాత్రే చేపలను పడుతూ పట్టణాలలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడని వారు వాపోయారు. కావున పిడిసిల్ల, ఎల్లారెడ్డిపల్లె గ్రామాల ఊర చెరువులోని చాపలను గ్రామ ప్రజలకు విక్రయించిన తరువాతనే పట్టణాలకు తరలించి విక్రయించాలని రెండు గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. పిడిసిల్ల గ్రామంలో ఒకే ముదిరాజు కుటుంబం ఉండడంతో అధికార పార్టీ అండదండలతో ఆ ముదిరాజ్ కులస్తుడు ఏం చేస్తారో చేసుకోండి అంటూ. రాత్రి వేళల్లో వేరే గ్రామానికి చెందిన ముదిరాజులను తీసుకొచ్చి చేపలు పడుతూ సొమ్ము చేసుకుంటున్నారని వాపోయారు. గ్రామపంచాయతీ తీర్మానం చేసిన వినకుండా గ్రామంలోని ప్రజలకు చేపలు విక్రయించకుండా చేయడం సరైంది కాదని అన్నారు. పిడిసిల్ల గ్రామంలోని ఊర చెరువు లో ప్రభుత్వ భూమి 14 ఎకరాలు మాత్రమేనని. మిగిలిన భూమి ఎల్లారెడ్డి పల్లె ఎస్సీ కులస్తులు, పిడిసిల్ల ఎస్సీ కులస్థులదని, గ్రామంలోని పట్టా భూమిలో చేపలు పెంచుకుంటూ గ్రామపంచాయతీ పాలకవర్గం మాటను వినకుండా అధికారపక్షం అండదండలతో చేపలు విక్రయించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నాడని. చేపలను పిడిసిల్ల, ఎల్లారెడ్డి గ్రామం ప్రజలకు విక్రయించిన తర్వాతనే పట్టణాలకు తీసుకువెళ్లి అమ్ముకోవాలంటూ ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఘటన స్థలానికి హుటాహుటిన ఎస్సై ముప్పు సురేష్ పోలీసు సిబ్బంది చేరుకొని. రోడ్డుపై బైఠాయించిన వారికి సామరస్యంగా అందరూ కలిసిమెలిసి సమస్యను పరిష్కరించుకోవాలని నచ్చజెప్పడంతో గ్రామస్తులు అక్కడినుండి తరలి వెళ్లారు. బైఠాయించిన వారిలో పిడిసిల్ల గ్రామ సర్పంచ్ నైనకంటి మమత, వార్డు సభ్యులు మాజీ సర్పంచ్. నైనకంటి ప్రభాకర్ రెడ్డి, ఎల్లారెడ్డి పల్లె, పిడిసిల్ల రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# ఓట్ల వేటలో 'కేంద్రం' దొంగదారి!





**కాంగ్రెస్ బలంగా ఉన్న చోట ఓట్ల తొలగింపునకు కుట్ర**

**30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్' పేరిట లేపేసే ప్లాన్**

**బీహార్, బెంగాల్ ఫార్ములాను ఇక్కడా ప్రయోగిస్తున్నారు**

**కేంద్ర దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్ష ప్రభుత్వాలపై దాడి**

**పాలేరు 'బి.ఎల్.ఏ'ల శిక్షణ శిబిరంలో మంత్రి పొంగులేటి నిప్పులు**

**ఖమ్మం, జూన్ 12 (పీపుల్స్ డైరీ) :** కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రతిపక్ష పార్టీలను, ప్రతిపక్ష ప్రభుత్వాలను టార్గెట్ చేస్తూ ప్రజాస్వామ్య విరుద్ధమైన కుట్రలకు తెరలేపిందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో అప్రజాస్వామిక పాలన సాగుతోందని మండిపడ్డారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల (బి.ఎల్.ఏ) అవగాహన శిక్షణ శిబిరం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట క్రాస్ రోడ్డులో గల పీవీఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి.. కేంద్ర ప్రభుత్వ వైఖరిని, బీజేపీ రాజకీయ వ్యూహాలను ఎండగడుతూ సుదీర్ఘంగా ప్రసంగించారు.

**'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం.. దొంగదారి చర్య!**

కేంద్ర ప్రభుత్వం చట్టం రూపంలో తీసుకువచ్చిన 'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం లాంటిదని, ఇది ముమ్మాటికీ దొంగదారి చర్యేనని మంత్రి విమర్శించారు. "కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే బలంగా ఉందో, ఎక్కడైతే మనకు ఓట్లు ఎక్కువగా ఉన్నాయో.. అక్కడ ఒక పద్ధతి ప్రకారం దాదాపు 30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్ ఓట్లు'గా చిత్రీకరించి, వాటిని జాబితా నుంచి తొలగించేందుకు కేంద్రం పెద్ద కుట్ర చేస్తోంది. ఓటరు వయస్సులో స్వల్ప తేడాలున్నా, పేర్లలో స్పెల్లింగ్ మిస్టేక్స్ (రావుకు బదులు రెడ్డి, హుస్సేన్ బదులు శ్రీ అని పడటం) ఉన్నా.. వాటన్నింటినీ వంకగా చూపి ఓట్లను లేపేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే బీహార్, వెస్ట్ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో ఈ పద్ధతిని ప్రయోగించి సక్సెస్ అయ్యారు. అదే ఫార్ములాను తెలంగాణలోనూ ప్రయోగించాలని చూస్తున్నారు. దీన్ని కాంగ్రెస్ సైనికులు గట్టిగా తిప్పికొట్టాలి" అని మంత్రి పిలుపునిచ్చారు.

**నిన్న ఓట్లు.. నేడు ఏకంగా సీట్లే దొంగిలిస్తున్నారు!**

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ఉదంతాన్ని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "మీనాక్షి నటరాజన్ కి కావలసిన ఓట్ల కంటే 11 ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ కేవలం ఒక పాత ఎఫ్ఐఆర్ కాగితాన్ని సాకుగా చూపి, ఎన్నికల అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అక్రమంగా ఆమె నామినేషన్‌ను తిరస్కరింపజేశారు. ఈ రకంగా కాంగ్రెస్ పార్టీకి దక్కాల్సిన ఒక రాజ్యసభ స్థానాన్ని వాళ్ళు దొంగిలించారు. నిన్నటి వరకు ఓట్లను దొంగిలించిన వాళ్ళ ఈరోజు ఏకంగా సీట్లనే దొంగిలించే దుస్థితికి కేంద్ర ప్రభుత్వం దిగజారింది" అని నిప్పులు చెరిగారు.

**సీబీఐ, ఈడీలతో బెదిరింపు రాజకీయాలు**

బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం దేశంలోని ప్రతిష్టాత్మక దర్యాప్తు సంస్థలను వేట కుక్కల్లా వాడుకుంటోందని మంత్రి తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ చేతుల్లో ఉన్న సీబీఐ, ఈడీ, ఇన్‌కమ్ టాక్స్ సంస్థలను అడ్డం పెట్టుకుని, వేరే పార్టీల తరపున గెలిచిన ప్రజాప్రతినిధులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఆయా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చేందుకు కుట్రలు పన్నుతున్నారని, భారతదేశంలో ఎక్కడ బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్నా ఇదే రకమైన దుర్మార్గపు పరిపాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రతి ఓటూ కాంక్రీట్ గోడ కావాలి..**

జూన్ 25 నుంచి జూలై 24 వరకు నెల రోజుల పాటు బూత్ లెవెల్ అధికారులు నిర్వహించే 'ఓట్ మ్యాపింగ్' ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. "ఉద్యోగాలు, చదువుల రీత్యా ఖమ్మం, హైదరాబాద్‌లలో ఉండే మన వాళ్ళు అధికారులు వచ్చినప్పుడు ఊర్లో లేరనే సాకుతో ఓట్లు తొలగించే ప్రమాదం ఉంది. అధికారులు వచ్చే ముందే గ్రామంలో చాటింపు వేయించి వేరే ఊర్లలో ఉన్న మన ఓటర్లను రప్పించి ఓటు కాపాడుకోవాలి. మనకు దొంగ ఓట్లు అవసరం లేదు.. మనకున్న జనాదరణతో ప్రతి ఓటునూ ఒక కాంక్రీట్ గోడ లాగా కాపాడుకోవాలి" అని స్పష్టం చేశారు. దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కాబోయే ప్రధానమంత్రి, మన నాయకుడు రాహుల్ గాంధీకి కార్యకర్తలంతా సైనికుల్లా అండగా నిలబడాలని, ఈ అక్రమ ఎస్ఐఆర్ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, పీసీసీ ప్రతినిధి సుధాకర్, ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్, ఏదులాపురం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, 291 బూత్‌ల బి.ఎల్.ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రమాదవశత్తు ట్రాక్టర్ మెకానిక్‌కు తీవ్ర గాయాలు

**గణపురం, జూన్ 12 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని నగరంపల్లి గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన రోడ్డుకు వాటర్ క్యూరింగ్ చేస్తుండగా వెంకటరాజు. వెంకన్న (48) అనే ట్రాక్టర్ మెకానిక్ ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గణపవరం చెందిన ట్రాక్టర్ మెకానిక్ వెంకన్న పని నిమిత్తం నూతన రోడ్డుకు వాటర్ ట్యాంకర్‌తో క్యూర్ చేస్తుండగా నారాపల్లిలోని అప్పయ్యపల్లి రోడ్డు వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద జారి పడటంతో తీవ్ర గాయాలు పాలయ్యాడు వెంటనే స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా వరంగల్ లోని ప్రైవేట్ గా ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు.



## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**పినపాక, జూన్ 12(పీపుల్స్ డైరీ) :** పినపాక మండల పరిధిలో విద్యుత్ షాక్ కి గురై మరణించిన సంఘటన గురు వారం రాత్రి చోటుచేసుకుంది. మల్లారం గ్రామపంచాయతి చిన్నరాజుపేట గ్రామానికి చెందిన పోలెబోయిన పొట్టెయ్య (65) ఇంట్లోని సర్వీస్ వైర్ ని ఎలుకలు కొట్టిన విషయం గమనించకపోవడంతో ఈ సంఘటన జరిగింది. విద్యుత్ శాఖా ఏఈ జి.వేణుగోపాల్ వివరాల ప్రకారం... ఇంట్లోని సర్వీస్ వైర్ ని ఎలుకలు కొరకడం వలన ఇన్సూలేషన్ ఊడిపోయిందన్నారు. పొట్టెయ్య ఇంట్లో బట్టలారేసుకోవడానికి ఉపయోగించే జిఐ విద్యుత్ వైర్ ఇన్సులేషన్ తెగిపోయిన సర్వీస్ వైర్‌ని త్రాకియుంది. ఇదిగమనించని పొట్టయ్య జిఐ వైర్‌ను తాకడంతో మృతి చెందినట్లు తెలిపారు.

## బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పరీక్షల లీకేజీలు

**ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య**




**గోవిందరావుపేట, జూన్ 12(పీపుల్స్ డైరీ) :** మతోన్మాదానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని, బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పరీక్షలు లీకేజీ.ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ బట్టాచార్య పిలుపు, గోవిందరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం రాష్ట్ర అధ్యక్షులు రజినీకాంత్ అధ్యక్షతన ములుగు జిల్లా, గోవిందరావుపేట మండల కేంద్రంలోని పిఎస్ఆర్ గార్డెన్ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య హాజరై మాట్లాడుతూ దేశంలో మతోన్మాద శక్తులు విద్యా వ్యవస్థను, రాజ్యాంగ విలువలను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు, అలాంటి విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా విద్యార్థి సమాజం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లనే తరచూ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలు జరుగుతున్నాయని అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకుండా వాటిని మూసివేసే విధానాలను చాప కింద నీరుల అనుసరిస్తోందని ఆరోపించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జాతీయ సహాయ కార్యదర్శి హతిక్ హమ్మద్, జాతీయ కమిటీ సభ్యులు శంకర్, మమత, రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్, అశోక్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు రంజిత్ రెడ్డి, దీపికా, శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు భరత్ రాజు, స్మరన్, రవి, రవితేజ, రమేష్, రమ్య, పవన్, కృపా, విఘ్నేష్, అభి, స్టాలిన్, లెనిన్ గువేరా, మధు, జ్యోతి బసు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు,

## ఏసీబీ దాడులపై బీజేపీ శ్రేణుల సంబరాలు



**నర్సింహులపేట, జూన్ 12 (పీపుల్స్ డైరీ) :** నర్సింహులపేట మండల పరిషత్ కార్యాలయంలో ఏసీబీ దాడులు నిర్వహించి అధికారులను పట్టుకున్న నేపథ్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. అవినీతికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడాన్ని స్వాగతిస్తూ మండల కేంద్రంలో బాణాసంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సూరబోయిన సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు అవినీతికి పాల్పడటం బాధాకరమన్నారు. ఏసీబీ అధికారులు సమర్థవంతంగా పనిచేసి అవినీతి వ్యవహారాన్ని బయటపెట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమం లో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు నెలకుర్తి సత్యనారాయణ రెడ్డి, కార్యకర్తలు,భోగి అనిల్, కాలు నాయక్, దాస రోజు హరీష్, బానోతు రమేష్, జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంతో రైతులు అప్రమత్తంగా ఉండాలి : ఏఓ నరసింహారావు



**ఏన్కూరు జూన్ 12 పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలోని ఆరికాయలపాడు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఎల్‌నినో ప్రభావం పంటల వైవిధ్యకరణ ప్రాముఖ్యత పంట అవశేషాలను కాల్చడం వల్ల కలిగే నష్టాలు నానో ఎరువుల వినియోగం,సమతుల్య ఎరువుల వినియోగం, నకిలీ విత్తనాల గుర్తింపు మరియు నివారణ చర్యలు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల ప్రయోజనాలు గురించి వివరించారు. అలాగే రైతులు పెసర, మినుములు, అపరాల పంటల సాగును ప్రోత్సహించాలని వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆయకట్టు ప్రాంతాల్లో నీటి వసతి లేని రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండి, అందుబాటులో ఉన్న నీటి వనరులను పరిగణనలోకి తీసుకుని పంటల సాగు చేపట్టాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు, యొక్క ప్రాముఖ్యతను వివరించి, ప్రతి రైతు తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి కె. కమలాకర్ నిర్వహించగా, గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్




**ఏన్కూరు జూన్ 12 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలోని భగవాన్ నాయక్ తండా అక్కినపురం తండాలలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను శుక్రవారం అదనపు కలెక్టర్ శ్రీజ పరిశీలించారు. ఓటర్ల జాబితాలో వివరాలు సరిగా ఉన్నాయా లేవా అనే విషయమై పరిశీలించారు. ఓటర్ల దగ్గరకు వెళ్లి వారితో మాట్లాడారు. ఓటర్ల వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సిహెచ్ శేషగిరిరావు, బిఎల్వోలు పాల్గొన్నారు.



## వీరాపురం ఇసుక రీచ్ వివాదం

**ఏకపక్ష నిర్ణయాలపై ఆగ్రహం.. రెండు సొసైటీలకు సమాన అవకాశం కల్పించాలి**

**పినపాక, జూన్ 12,(పీపుల్స్ డైరీ) :** వీరాపురం ఇసుక రీచ్ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ గిరిజన మహిళలు శాంతియుత నిరాహార దీక్ష చేపట్టారు . పినపాక మండలం దుగినేపల్లి గ్రామానికి చెందిన 'శ్రీగిరి లక్ష్మి ఇసుక క్వారీ ట్రైబల్ లేబర్ కాంట్రాక్ట్ సహకార సంఘం' ఆధ్వర్యంలో గిరిజన మహిళలు దీక్ష చేపట్టారు. అధికారుల నిర్లక్ష్యంపై ఆవేదన వ్యక్తం చేశారు. వీరాపురం ఇసుక రీచ్‌కు సంబంధించి రెండు గిరిజన సహకార సంఘాలు ఉన్నప్పటికీ, అధికారుల నిర్ణయాలు ఏకపక్షంగా సాగుతున్నాయని గిరిజన మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ, టీజీఎండీసీ , డీసీఓ, ఎంపీడీఓ తదితర అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయిందన్నారు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులు చేసుకున్నప్పటికీ, ఇప్పటివరకు సమస్యకు స్పష్టమైన పరిష్కారం లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వీరాపురం ఇసుక రీచ్ నిర్వహణలో రెండు సొసైటీలకు సమాన అవకాశం కల్పించాలని కోరారు. గ్రామసభ, తీర్మానాలు మరియు సంబంధిత ప్రక్రియలపై తక్షణమే పారదర్శక విచారణ జరపాలని వివాదం పూర్తిగా పరిష్కారం కాకముందే ఏ ఒక్క సొసైటీకి వర్క్ ఆర్డర్ జారీ చేయరాదన్నారు. గిరిజన మహిళల జీవనోపాధి హక్కులను పూర్తిస్థాయిలో పరిరక్షించాలని అధికారులు వేడుకున్నారు.

## పోలీస్ సిబ్బందికి గుండె వైద్య పరీక్షలు : సీపీ



**ఖమ్మం, జూన్ 12 (పీపుల్స్ డైరీ) :** పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల ఆరోగ్యానికి పోలీస్ శాఖ ప్రాధాన్యమిస్తోందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. ఖమ్మం ఏఆర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో హైదరాబాద్ యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఈసీజీ, టూడీ ఈకో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిభిరాన్ని ప్రారంభించిన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... ఆరోగ్యంగా ఉంటేనే విధులను సక్రమంగా నిర్వహించగలుగుతారని, కుటుం బంలో ప్రశాంత ఉంటుందన్నారు. స్వీయ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విధినిర్వహణలో పోలీస్ సిబ్బంది ఎదుర్కొనే ఒత్తిడి కారణంగా గుండె జబ్బులు, ప్రాణాంతక సమస్యలను ముందుగానే గుర్తించి నివారించడానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమైన గుండె వైద్య పరీక్షలు ఈసీజీ, టూడీ ఈకో పరీక్షలను యశోద వంటి ప్రముఖ ఆసుపత్రుల సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి, సిబ్బందికి ఈ ఆరోగ్య ప్రొఫైల్స్‌ను అందిస్తున్నాయట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ యశోద హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు భరత్ రెడ్డి, సీనియర్ మేనేజర్ వినయ్ కుమార్, ఎస్బి ఏసీపీ మహేష్, ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, నర్సయ్య, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష, సాంబశివరావు పాల్గొన్నారు.

## నేడు మణుగూరులో బీఎల్‌ఏల శిక్షణ శిబిరం



**పినపాక, జూన్ 12,(పీపుల్స్ డైరీ) :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణ శిబిరం శనివారం మణుగూరులో నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, జిల్లా ఉపాధ్యక్షులు గొడిశాల రామనాథం తెలిపారు. శుక్రవారం ఆయన పినపాక మండల కేంద్రంలో మాట్లాడారు. మణుగూరులోని డీవీ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ షబ్బీర్ అలీ ట్రైనర్‌గా వ్యవహరించనున్నారన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న హాజరుకానున్నారని తెలిపారు. కావున నియోజకవర్గానికి చెందిన బీఎల్‌ఏలు, సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ కార్యకర్తలు, నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT SATYANARAYANA PRINTERS, H.NO.4-6-144, TILAK ROAD, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA, STATE. PUBLISHED AT H.NO. 10-3-488, OPP: RTC WORK SHOP, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE,
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com